

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి జల్లులు

అనకాపల్లి అగ్రికల్చర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి జల్లులు కురుస్తాయని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ టి.శ్రీలత తెలిపారు. మంగళవారం ఆర్ఏఆర్ఎస్‌లో జరిగిన 'వాతావరణ ఆధారిత వ్యవసాయం' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాగల ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 31 నుంచి 33 డిగ్రీలు, కనిష్ఠంగా 25.2 నుంచి 26.3 డిగ్రీలు ఉండవచ్చునని తెలిపారు.

ఖరీఫ్‌నకు ఊపిరి

రైతన్నను ఆదుకున్న భారీ వర్షాలు

- వరి నారుమడులు, వరి నాట్లు ఎండిపోతున్న తరుణంలో కరుణించిన వరుణుడు
- పొలాల్లో పుష్కలంగా చేరిన నీరు
- ఊపందుకున్న వ్యవసాయ పనులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలు అన్నదాతలను ఆదుకున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వేసిన వరి నారుమడులు, వరి నాట్లు వర్షాభావం వల్ల ఎండిపోతున్న తరుణంలో ఆది, సోమవారాల్లో కురిసిన వర్షాలు రైతులకు ఎంతో మేలు చేశాయి. మంగళవారం వర్షం కురవకపోవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఎక్కడ చూసిన వరి నాట్లు వేయడం, దమ్ము చేస్తున్న దృశ్యాలే కనిపించాయి.



గొలుగొండ మండలం చోద్యంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

జిల్లాలో ఈ ఏడాది ఆగస్టు నెల రెండో వారం ముగిసిపోతున్నా సరైన వర్షాలు లేకపోవడంతో వరి నారుమడులు సిద్ధం చేసుకున్నా, నీరు లేక చాలా మంది రైతులు నాట్లు పూర్తి చేసుకోలేకపోయారు. దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో కొంతవరకు నాట్లు వేసుకోగలిగారు. ఇప్పటికే వరి నారుమడులు ... మిగతా 8వ పేజీలో



గొలుగొండ మండలం కొంగసింగిలో వరినాట్ల కోసం ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం

చెరువుల్లా వరి పొలాలు

వర్షాలు తగ్గినా ఇంకా ముంపులోనే..

- పెద్దేరు నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఈ పరిస్థితి

చోడవరం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలా గ్రామాల్లో పంట పొలాలు ఇంకా నీటి ముంపులోనే ఉన్నాయి. మండలంలోని చాకిపల్లి, కన్నంపాలెం, జన్నవరం, పీఎస్‌పేట, అంకుపాలెం, నరసయ్యపేట, తదితర పంచాయతీల్లోని పంట పొలాలు ఇంకా నీట మునిగే ఉన్నాయి. ఆదివారం కురిసిన భారీ వర్షానికి పంట పొలాల్లోకి భారీగా నీరు చేరిన సంగతి తెలిసిందే. భారీ వర్షానికి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడంతో పెద్దేరు ఉధృతి పెరిగింది. దీంతో మండలంలోని చాకిపల్లి, రామజోగిపాలెం, కన్నంపాలెం, జన్నవరం, పీఎస్‌పేట, భోగాపురం, తదితర పంచాయతీల్లోని పంట పొలాలు పూర్తిగా నీటి ముంపునకు గురయ్యాయి. ఇప్పటికే ఆకు మడులు వేసిన పొలాలన్నీ నీటితో నిండిపోయాయి. కన్నంపాలెంలో వేసిన చెరకుతోటలు కూడా ఇంకా నీటిముంపులోనే ఉన్నాయి. పెద్దేరు నదిలో ఉధృతి తగ్గితే తప్ప, ఈ గ్రామాల్లోని నీరు తగ్గే పరిస్థితి లేకపోవడంతో పంట పొలాలు చెరువులను తలపించే విధంగా ఉన్నాయి. కాగా కన్నంపాలెం, చాకిపల్లి ప్రాంతాల్లో వరి ఆకుమడులతో పాటు, ఇప్పటికే నాట్లు వేసిన వరి పొలాలు సైతం నీట మునిగిపోవడంతో వరినారు కుళ్లిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



భారీ వర్షానికి నీట మునిగిన చాకిపల్లి, రామజోగిపాలెంలోని పంట పొలాలు

జలాశయాలు కళకళ

- రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పెరిగిన నీటిమట్టాలు

అనకాపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలోని జలాశయాలు వరద నీటితో కళకళలాడుతున్నాయి. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు చేరడంతో నిండుకుండలా దర్శనమిస్తున్నాయి.**

జిల్లాలోని జలాశయాల నీటి సామర్థ్యం, మంగళవారం నాటికి నిల్వలు ఇలా..

జలాశయం	పూర్తి సామర్థ్యం	ప్రస్తుత నిల్వ
తాండవ	380.00 అడుగులు	375.55 అడుగులు
రైవాడ	114.00 మీటర్లు	113.18 మీటర్లు
కోనాం	101.25 మీటర్లు	99.6 మీటర్లు
వరహా	460.00 అడుగులు	451.7 అడుగులు
పెద్దేరు	137.00 మీటర్లు	135.95 మీటర్లు

గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జలాశయాల్లో నీటి నిల్వలు లేక రైతులు సాగునీటి ఎద్దడిని ఎదుర్కొన్నారు. ఇప్పుడు భారీ వర్షాలు కురవడంతో సాగునీటి కష్టాలు ఉండవని భావిస్తున్నారు. రైవాడ, తాండవ, పెద్దేరు, కోనాం, వరహా జలాశయాల్లో గతేడాది కంటే ఈ ఖరీఫ్ సీజన్‌లో నీటిమట్టం ఎక్కువగా ఉంది. తాండవ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 380 అడుగులు కాగా, మంగళవారం నాటికి 375.55 అడుగులు ఉంది. రైవాడ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం 113.18 మీటర్లు ఉంది. కోనాం జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99.6 మీటర్లు, వరహా జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 460 అడుగులు కాగా, ప్రస్తుతం 451.7 అడుగులు, పెద్దేరు జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 135.95 మీటర్లు ఉంది. జలాశయాలు నిండుకుండలా దర్శనమిస్తుండడంతో ఈ ఏడాది సాగునీటి కష్టాలు ఉండవని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వరద నీటితో కళకళలాడుతున్న రైవాడ జలాశయం

అనర్హుల ఏరివేత షురూ!

జిల్లాలో 3,358 దివ్యాంగ పింఛన్లు రద్దు

- రీ వెరిఫికేషన్‌లో నిర్ధారణ
- అభ్యంతరాల స్వీకరణకు అవకాశం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అనర్హులైన దివ్యాంగ పింఛనుదారుల ఏరివేత ప్రక్రియ మొదలైంది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పెద్దఎత్తున అనర్హులు దివ్యాంగుల పింఛన్లు పొందుతున్నారనే ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్‌లతో అనర్హుల జాబితా సిద్ధం చేసి, వారి పింఛన్లను రద్దు చేస్తున్నది.

జిల్లాలో 30,800 మంది దివ్యాంగులు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీరికి నెలకు రూ.6 వేలు వంతున అందిస్తోంది. వీరిలో 18 వేల మంది సదరం సర్టిఫికెట్లను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు పునఃపరిశీలించారు. ఇందులో 3,358 మంది అనర్హులుగా తేల్చారు. వారి పింఛన్లు రద్దు చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అనర్హుల్లో 799 మంది ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ.4 వేలు పొందేందుకు అర్హులుగా తేల్చారు. వారికి వచ్చే నెల నుంచి దివ్యాంగుల పింఛన్ కాకుండా నెలకు రూ.4 వేలు పింఛన్ అందనుంది. జిల్లాలో ఇంకా 20 వేల మంది సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతోంది. గత వైసీపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేసింది. దీంతో అనేక మంది అనర్హులు కూడా దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిపై దృష్టి సారించింది. 75 శాతం దాటి వైకల్యం ఉంటేనే దివ్యాంగ పింఛన్ కొనసాగించే విధంగా చర్యలు చేపట్టింది. అయితే రద్దయిన దివ్యాంగ పింఛన్ లబ్ధిదారుల నుంచి మండల అభివృద్ధి అధికారులు అభ్యంతరాలు స్వీకరిస్తున్నారని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు. అభ్యంతరాలుంటే దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

ఆర్‌ఈసీఎస్‌పై విచారణకు మోకాలడ్డు?

ఇక్కడ కొందరు ఉద్యోగులు చేస్తున్న ప్రయత్నాలకు విజయవాడ అధికారి సహాయ సహకారాలు

- అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సంఘానికి గతంలో పర్సన్ ఇన్‌చార్జిగా పనిచేసిన సదరు అధికారి
- ఆయన హయాంలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నట్టు ఆరోపణలు
- అవన్నీ బయటపడతాయనే విచారణను అడ్డుకునేందుకు యత్నం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సంఘం (ఆర్‌ఈసీఎస్)లో అక్రమాలపై విచారణ ముందుకు సాగకుండా విజయవాడలోని ఓ ఉన్నతాధికారి అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సహకార శాఖలో పనిచేస్తున్న ఆయన...గతంలో ఆర్‌ఈసీఎస్‌కు కొన్నాళ్లు పర్సన్ ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆ సమయంలో చేతివాటం ప్రదర్శించారనే ఫిర్యాదులు ఉన్నాయి. హుద్‌హుద్ సమయంలో ఆయన ఇక్కడే ఉన్నారు. తుఫాన్ గాలులకు విద్యుత్ వ్యవస్థ సమూలంగా నాశనం కావడంతో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ వైర్లు వంటివి పెద్ద మొత్తంలో కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఆర్‌ఈసీఎస్‌లో విద్యుత్ పరికరాల కొనుగోళ్లకు ఎటువంటి టెండర్‌ల విధానం పాటించడం లేదు. ఐదు లక్షల రూపాయలు, అంతకంటే ఎక్కువ మొత్తం అయితే టెండర్ పిలవాలి. కానీ ఆ నిబంధనను తుంగలో తొక్కి, నామినేషన్ పద్ధతిపైనే నచ్చిన వారితో కొనిపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆయన అస్మదీయ సంస్థల నుంచి కోట్ల రూపాయల పరికరాలు కొనుగోలు చేయించారు. ఆర్‌ఈసీఎస్‌లో నిధుల స్వాహాకు అధికారులు కొన్ని అడ్డగోలు పనులుచేసేవారు. కోటి రూపాయల పరికరాలు అవసరమైతే రెండు కోట్ల రూపాయలు అవసరమని ఫైల్ పెట్టి, డబ్బులు మంజూరు చేసేవారు. సరకు మాత్రం కోటి రూపాయలకే వచ్చేది. బిల్లు రెండు కోట్లు చెల్లించినట్టు చూపించేవారు. ఆ అదనపు కోటి రూపాయలు అధికారులు, సిబ్బంది దిగమింగేవారు. ఇప్పుడు ఆర్‌ఈసీఎస్‌లో జరుగుతున్న విచారణలో ఆ బాగోతాలు బయటకు వస్తాయన్న భయంతో దర్యాప్తు ముందుకు సాగకకుండా సదరు అధికారి అడ్డం పడుతున్నారు. కేసును నీరు గార్చేందుకు యత్నిస్తున్న వర్గానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు.



మాజీ ఎండీదీ అదే తీరు

ఆర్‌ఈసీఎస్ పనితీరు బాగా లేదని, ప్రభుత్వం లైసెన్స్ ఇవ్వలేదని పేర్కొంటూ సంస్థను ఈపీడీసీఎల్‌కు అప్పగించాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) 2021 మార్చిలో ఆదేశించింది. ఆ ఉత్తర్వును పక్కనపెట్టి అప్పటి ఎండీ రామకృష్ణంరాజు ఆరు నెలలు ఆర్‌ఈసీఎస్‌ను సహకార రంగంలోనే నడిపించారు. సర్వసభ్య సమావేశం ... మిగతా 8వ పేజీలో

నీట్ పీజీ- 2025లో మెరిసిన శ్రీనివాస్‌కుమార్

- జాతీయ స్థాయిలో 1,913 ర్యాంక్ సాధించిన మెలుపాక డాక్టర్

మునగపాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి)

నీట్ పీజీ- 2025లో మెలుపాక గ్రామానికి చెందిన డాక్టర్ గుర్రం శ్రీనివాస్ కుమార్ ప్రతిభ చాటారు. నీట్ పీజీ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. శ్రీనివాస్‌కుమార్ 800 మార్కులకు గాను 612 మార్కులతో జాతీయ స్థాయిలో 1,913 ర్యాంక్ సాధించారు. ఆయన తాతయ్య సూర్యప్రకాశరావు ఆయుర్వేద వైద్యుడు. తండ్రి శ్రీనివాస్ చూచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తరణాధికారి (ఎంపీహెచ్‌ఈవో)గా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీనివాస్‌కుమార్ సోదరి వీర వెంకట శరణ్య విశాఖ ఏఎంసీలో ఎంబీబీఎస్ చదువుతోంది. శ్రీనివాస్‌కుమార్ 2018-2023 వరకు శ్రీకాకుళం జెమ్స్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. తరువాత హైదరాబాద్‌లో నీట్ పీజీ- 2025 అర్హత పరీక్షకు కోచింగ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ ఎండీ జనరల్ మెడిసిన్‌లో చేరేందుకు అర్హత సాధించానన్నారు. మూడు సంవత్సరాల కోర్సు పూర్తయిన తరువాత సూపర్ స్పెషలైజేషన్ కూడా చేస్తానని చెప్పారు. ఆ తరువాత న్యూరాలజిస్టుగా గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలందిస్తానని తెలిపారు.



డాక్టర్ శ్రీనివాస్‌కుమార్

736 కిలోల గంజాయి స్వాధీనం

మాడుగులలో 320, నర్సీపట్నంలో 216, పాయకరావుపేటలో 200 కిలోలు

మొత్తం 22 మంది అరెస్టు

మాడుగుల/నర్సీపట్నం అర్బన్/పాయకరావుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు సోమవారం తనిఖీలు చేసి 736 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, మొత్తం 22 మందిని అరెస్టు చేశారు. మాడుగులలో 320 కిలోలతో 16 మంది, నర్సీపట్నంలో 216 కిలోలతో ముగ్గురు, పాయకరావుపేటలో 200 కిలోలతో ముగ్గురు పట్టుబడ్డారు. ఈ వివరాలను ఆయా ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం వెల్లడించారు. మాడుగులలో అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఒడిశాలో కొనుగోలు చేసిన 320 కిలోల గంజాయిని జిల్లాలోని వి.మాడుగుల మండలం శంకరం పంచాయతీ బొడ్డరేవు గ్రామ సమీపంలో ఆటోలో లోడ్ చేసేందుకు నిందితులు ప్రయత్నించారు.



మాడుగుల మండలం శంకరం పంచాయతీ బొడ్డరేవు వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడిన నిందితులతో పోలీసులు

ముందస్తు సమాచారం మేరకు మాడుగుల ఎస్‌ఐ జి.నారాయణరావు సిబ్బందితో అక్కడ మాటు వేసి గంజాయిని స్వాధీనం చేసుకుని, 16 మందిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారయ్యారు. పట్టుబడిన వారిలో అల్లూరి జిల్లా జి.మాడుగులకు చెందిన దుక్కేరి బుజ్జిబాబు, పెదబయలు మండలానికి చెందిన దలాయి చంటిబాబు, పాడేరు మండలానికి చెందిన కిల్లో కొండబాబు, జి.మాడుగుల మండలానికి చెందిన వంతల సతీశ్, వంతల అశోక్, వంతల నాగరాజు, కిల్లో చిరంజీవి, కొర్ర చిన్నారావు, వంతల గణేశ్ కొర్రా జగన్, కొర్రా తిరుపతి, పాంగి రాంబాబు, చింతపల్లి మండలానికి చెందిన కిల్లో సింహాద్రి, కొర్రా చంద్రరావు, వి. మాడుగుల మండలం శంకరం పంచాయతీ తాడివలసకు చెందిన పాగి ఈశ్వరావు, వంతల కిశోర్‌లు ఉన్నారు. వీరిని అరెస్టు చేసి మంగళవారం సాయంత్రం విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు.

నర్సీపట్నంలో 216 కిలోలు..

నర్సీపట్నం రూరల్ సర్కిల్ పరిధిలోని గొలుగొండ మండలం కొమిర శివారు ప్రాంతంలో పోలీసులు 216 కిలోల గంజాయిని పట్టుకొని, ముగ్గురిని అరెస్టు చేశారు. మంగళవారం డీఎస్పీ శ్రీనివాసరావు అందించిన వివరాలు ఇలా ఉన్నారు. ముందుగా అందిన సమాచారంతో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, నర్సీపట్నం రూరల్, గొలుగొండ ఎస్‌ఐలు రాజారావు, రామారావు కొమిర శివారు ప్రాంతంలో నిఘా పెట్టారు. ఆ సమయంలో వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా 216 కిలోల ... మిగతా 8వ పేజీలో



వరికి ఊపిరి పోసిన వర్షాలు

▸▸ పల్లెల్లో ముమ్మరంగా వరినాట్లు

నక్కపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎండిపోతున్న వరి నారుమడులు, వరి నాట్లుకు అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలు ఊపిరి పోశాయి. వర్షాలతో అనేక గ్రామాల్లో రైతులు పొలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. రెండు రోజుల్లో 77మి.మీ వర్షపాతం నమోదైంది. వరి పొలాల్లో సమృద్ధిగా నీరు చేరింది. ఇప్పటివరకూ మండలంలో 1,250 ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. దేవవరం, చినరాంభద్రపురం, గొడిచెర్ల, ఉద్దండపురం, గుల్లిపాడు, రమణయ్యపేట, దోసలపాడు, ముకుందరాజుపేట, జీ జగన్నాథపురం, డొంకాడ గ్రామాల్లో వరి నాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 4,350 ఎకరాలని, వారం రోజుల్లో 50 శాతం వరినాట్లు పూర్తవుతాయని ఏవో ఉమాప్రసాద్ చెప్పారు. మొదటి దమ్ము చేసేటప్పుడు 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ వేయాలన్నారు. సూపర్ ఫాస్పేట్ వేయకపోతే.. చివరి దమ్ములో 50 కిలోల డీఏపీ, 15 కిలోల పొటాష్ వేస్తే సరిపోతుందని ఆయన చెప్పారు.


దమ్ము పట్టి వరి నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్న పొలాలు


కోటవురట్ల మండలం యండపల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

కోటవురట్లలో..

మండలంలోని వరి పొలాల్లో వర్షం నీరు చేరడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దుగ్గాడకాలువ, ఏటికాలువ కింద పొలాల్లో వేయడానికి రైతులు ఉత్సాహంగా పనులు చేస్తున్నారు. కూలీలు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. మండలంలో వరి సాగు 1,748 హెక్టార్లు సాధారణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 350 హెక్టార్లలో నాటు పూర్తయినట్టు ఏవో సరోజిని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి.

నాగులాపల్లిలో ఉత్కంఠంగా కబడ్డీ పోటీలు

మునగపాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగులాపల్లిలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఉత్కంఠంగా జరుగుతున్నాయి. తొమ్మిది జిల్లాలకు చెందిన స్త్రీ, పురుష క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొన్నారు. పోటీలను తిలకించడానికి విచ్చేసిన ప్రముఖలకు దొడ్డి శ్రీను సాదరస్వాగతం పలికారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పోటీలను వీక్షించిన వారిలో ఉన్నారు. ఈనెల 20వ తేదీన ఫైనల్ పోటీతో పాటు బహుమతులు ప్రదానోత్సవం ఉంటుందని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు తెలిపారు.


ఉత్కంఠంగా జరిగిన కబడ్డీ పోటీలు




విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి : సినీ గాయని కౌసల్య

పాయకరావుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ సినీ నేపథ్య గాయని కౌసల్య అన్నారు. మంగళవారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల 49వ వ్యవస్థాపక దినోత్సవాల ముగింపు సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యనే కాకుండా విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. నిత్యసాధన చేస్తే మీరంతా భవిష్యత్తులో మంచి గాయకులుగా రాణించే అవకాశం ఉందన్నారు. అనంతరం ఆమె తన పాటల ద్వారా ఆహూతులను ఉర్రూతలూరించారు. అదేవిధంగా ప్రముఖ కీబోర్డు ప్లేయర్ రవిశేఖర్ పలు పాటలు వినిపించి అలరించారు. అనంతరం గాయని కౌసల్య, రవిశేఖర్‌లకు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రసంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, భానుమూర్తి, డాక్టర్ బంగార్రాజు, డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, బి.సీతారాణి, మేనేజరు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కౌసల్యకి జ్ఞాపిక అందజేస్తున్న సీహెచ్.విజయ్‌ప్రకాష్



పంట పొలాల్లోంచి రోడ్డు వేయవద్దు : రైతులు

అచ్యుతాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):పంట పొలాల్లోంచి రోడ్డు వేస్తే తాము ఉపాధి కోల్పోతామని రైతులు అధికారులకు తెలిపారు. అచ్యుతాపురం-గాజువాక రోడ్డులో గల రామన్నపాలెం నుంచి అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డులో గల చోడపల్లి వరకు రింగ్ రోడ్డు మంజూరైంది. దీని కోసం రైతుల అభిప్రాయ సేకరణకు వీఎంఆర్‌డీఏ డిప్యూటీ డైరెక్టర్ చైతన్య, టైన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావు మంగళవారం చోడపల్లిలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జిరాయితీ భూముల గుండా రోడ్లు వేయవద్దని, పక్కనే ప్రభుత్వ భూముల నుంచి వేయాలని కోరారు. తమ గ్రామం గుండా రోడ్డు రావడంతో గ్రామంలో ఇళ్లు కోల్పోతామని, తమకు పునరావాసం కల్పించాలని కోరారు. నివేదికను అధికారులకు పంపుతామరి అధికారులు చెప్పారు. ఈసమావేశంలో గండిబోయిన వెంకట్, ధర్మిరెడ్డి నాయుడు బాబు, కూండ్రపు సోమునాయుడు, డి గోవింద్, డి. సత్యం, కాకి శ్రీను, లోకనాథం, డి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ పండుగ

రాంబిల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమిలిలో పరదేశమ్మ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమలను నివేదించి తమ మొక్కులు తీర్చుకున్నారు. వైసీసీ నియోజకవర సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు.



వైసీపీ బలోపేతమే ధ్యేయం : ధర్మశ్రీ

ఎలమంచిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ బలోపేతమే ధ్యేయంగా పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని వైసీపీ క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామంలోను కమిటీలను నియమించాలన్నారు. సమస్యల పట్ల కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆర్రెపు గుప్తా, మునిసిపల్ కోఆప్షన్ మెంబరు దూది నరసింహామూర్తి, వైసీపీ నాయకులు బొద్దపు యర్రయ్యదొర, పి.అమృతవల్లి, పాల్గొన్నారు.





సర్వసిద్ధి ఎస్సీ కాలనీ అభివృద్ధి కమిటీ

ఎలమంచిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం మండలం సర్వసిద్ధి ఎస్సీ కాలనీకి చెందిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యువజన సంఘం అభివృద్ధి కమిటీ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని ఎస్ఎన్ఆర్ హాలులో ఎస్.కల్యాణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షునిగా మలిజెడ్డి రమణారావు, ఉపాధ్యక్షులుగా కె.అచ్చారావు, ఎస్.శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, ట్రెజరర్స్‌గా కె.పరమేశ్వరరావు, జి.రమేష్, ఎమ్. అబద్ధం, సెక్రటరీలుగా ఎస్. గోవింద్, కె, శేఖర్, జి,మోహనరావు, జాయింట్ సెక్రటరీలుగా కె. అనిల్ కుమార్, చిలుకు, బి.దానియేలును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మలిజెడ్డి అప్పారావు, ఈరిగిల అప్పల కొండ, కందలాడ కిరణ్‌కుమార్, కసిపా దేముడు పాల్గొన్నారు.





















విద్యాలయాల్లో శతశాతం ప్రవేశాలు పూర్తిచేయండి

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని విద్యాలయాల్లో ఈ నెలాఖరులోగా శత శాతం ప్రవేశాలు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లాలోని అన్ని సంక్షేమ శాఖల అధికారులతో కలిసి వసతిగృహ సంక్షేమ అధికారులతో ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు, రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాలలో ప్రవే శాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

విద్యాలయాలు, మోడల్ కళాశాలలు, మహాత్మా జ్యోతిరావ్ పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతిగృహాలు, కళా శాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో శతశాతం సీట్ల భర్తీ చేయాలని ఆదేశించారు. అలాగే పక్కాగా మెనూ అమలు చేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత సంక్షేమ వసతిగృహాల అధికారులపై ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వెను కబడిన తరగతుల, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కె.శ్రీదేవి, రామనందం, మంగవేణి, సాంఘిక, గిరిజన వెనుకబడిన తరగతుల గురుకు పాఠ శాలల కోఆర్డినేటర్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ విద్యాలయాల ప్రిన్సిపాళ్లు, సంక్షేమ వసతిగృహాల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో జోనల్ కమిషనర్ తనిఖీలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉడ్‌పేట వార్డు సచివాలయాన్ని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి మంగళ వారం తనిఖీ చేశారు. ప్రతీ అసైన్‌మెంట్‌ను పరిశీ లించాలని, మున్సిపాలిటీ స్థలాలను పరిశీలించి వివరాలు అందించాలని సిబ్బందికి ఆయన ఆదేశించారు. సచివాలయాలకు వచ్చే ప్రజలతో సత్సంబంధాలు మెరుగుపరుచుకోవాలని సూచిం చారు. అనంతరం విజయరామరాజుపేటలో పర్యటించి కుళాయిల నుంచి విడుదలవుతున్న తాగునీటి పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. అన్న క్యాంటీన్లను



ఉడ్‌పేట సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న జడ్సీ

పరిశీలించి ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని అందించా లని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ

సబ్బవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు బ్రాంచి ఆవరణలో మంగళవారం ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన పథకం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఎం డి.రాజశేఖర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు సాలాపు అప్పారావు, మండల రమ్య, రాపల్లి నూకరాజు జీవన జ్యోతి పథకంలో రూ.436తో ఇన్స్యూరెన్స్ తీసుకున్నారన్నారు. ఇటీవల వారు మృతి చెందడంతో, నామినీలుగా ఉన్న కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందించామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పైల ప్రసాదరావు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు రామయ్యనాయుడు మృతి



రామయ్యనాయుడు (ఫైల్ ఫొటో)

పరవాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రావాడ పంచాయతీ పరిధిలోని ధర్మా రాయుడుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కేఎస్‌ఏ.రామయ్య నాయుడు (67) మృతి చెందారు. ఆయనకు గుండెపోటు రావడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పగా, చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో పరవాడ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఆయన ఓడిపోయారు. తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ లోనే కొనసాగారు. అతనికి భార్య స్వర్ణలత, కుమారుడు కౌశిక్, కుమార్తె లిఖిత ఉన్నారు. స్వగ్రామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించడం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. రామయ్యనాయుడు మృతికి అన్ని రాజకీయ పార్టీల నేతలు సంతాపం తెలియజేశారు.

ఎక్కడబడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు

ఎంపీడీవో నారాయణమూర్తి

సబ్బవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడబడితే అక్కడ చెత్తను పడేస్తే కఠిన చర్యలు చేపడతామని ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద నారాయణమూర్తి హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో చెత్త నిర్వహణపై మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేజరు పంచాయతీ పరిధిలోని పలు దుకాణాలు, రెస్టారెంట్లకు వెళ్లి యజమానులకు నోటీసులు జారీ చేశారు. వ్యాపార సంస్థలు, దుకాణాల వద్ద తప్పనిసరిగా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకొని, అందులోనే చెత్తను వేయాలని వారికి సూచించారు. అలాగే గ్రీన్ అంబాసిడర్లకు చెత్తను అందజేయాలని చెప్పారు. ఇష్టానుసారం చెత్తను వేస్తే సహించేది లేదని, లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. చెత్త నిర్వహణ సక్రమంగా లేని ఇద్దరి యజమానుల నుంచి లైసెన్స్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వై.రాజేశ్వరరావు పాల్గొన్నారు.



వ్యాపారులకు నోటీసులు అందిస్తున్న ఎంపీడీవో శివప్రసాద్‌నారాయమూర్తి

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో అతిథి అధ్యాపకులుగా పని చేయాలనుకునే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా విద్యాశాఖా ధికారి మద్దిలి వినోద్‌బాబు ఒక ప్రకటనలో తెలి పారు. విశ్రాంతి అధ్యాపకులు, విశ్రాంతి స్కూల్ అసిస్టెంట్‌లు, ఇప్పటికే పనిచేస్తున్న అధ్యాపకులు అర్హులన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 50 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీన ఒరిజినల్, జెరాక్స్ కాపీలను సంబంధిత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అందజేయాలని తెలిపారు. 22వ తేదీన అనకాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని ఆయన తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలని ఆందోళన

పరవాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫార్మాసిటీలో కార్మికులతో కలిసి మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో 44 విభాగాలను ప్రైవేటీకరించడానికి కేంద్ర ప్రభుత్వం బిడ్ ఆహ్వానిం చిందని, ఈ చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జోక్యం చేసుకొని ఈవోఐను రద్దు చేయించాలని కోరారు. అలాగే స్థానిక కార్మికుల పట్ల వేధింపులు మానుకోవాలని, కార్మికుల తొలగింపు చర్యలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.అప్పలరాజు, జి.చిట్టిబాబు, కె.రమణ, శేషు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తల శిక్షణను వినియోగించుకోండి

సబ్బవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ కార్యక్రమం కన్వీనర్ పి.విజయ్‌కుమార్ సూచిం చారు. ట్రేజ్ ఐటీ ప్రైవేట్ కంపెనీ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అనకపల్లిలో ఇస్తున్న మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 45 ఏళ్ల వయసు గల ఔత్సాహిక నిరుద్యోగ యువతీ యువకులు తమ పేర్లు నమోదు చేసుకొని శిక్షణ తరగతలకు హాజరు కావచ్చన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ డి.రాజేశ్ మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు మంజూరు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ గండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారిడార్ పనులపై ఆర్డీవో ఆరా

నక్కపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో జరుగుతున్న బల్క్‌డ్రగ్ పనులపై మంగళవారం నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ ఆరా తీశారు. నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయంలో పలు పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అదనపు భూ సేకరణకు సంబంధించి భూములు సేకరించాల్సిన గ్రామాల్లో సర్వే నంబర్లను డీటీ నారాయణరావు వివరించారు. నిర్వాసిత రైతుల సమస్యలు, ప్యాకేజీ తదితర అంశాల గురించి చర్చించారు.

పూడిమడక ఉప్పుటేరులో భారీగా చనిపోయిన చేపలు


ఉప్పుటేరులో చనిపోయిన చేపలు

అచ్యుతాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పూడిమడక ఉప్పుటేరులో మంగళవారం భారీగా చేపలు చనిపోయి పైకి తేలిపోయాయి. ఉప్పుటేరులోని నీరు కూడా నల్లగా మారిపోయింది. దీంతో సెజ్ కర్మాగారాల్లోని వ్యర్థా జలాలు ఉప్పుటేరులోకి వదిలేయడం వల్లే భారీగా చేపలు చనిపోతున్నాయని మత్స్యకార నాయకుడు చేపల తాతలు తెలిపారు. తాము ఫిర్యాదు చేసినప్పుడల్లా పొల్యూషన్ అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లిపోతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపటం లేదని ఆయన ఆరోపించారు. దీని వల్ల ఉప్పుటేరులో చేపలు పట్టడానికి మత్స్యకారులు భయపడుతున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పంచాయతీరాజ్ అధికారులతో కలెక్టర్ సమీక్షజ

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ అధికారులతో కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం సమీక్షించారు. పంచాయతీరాజ్ శాఖ పనులకు సంబంధించి నియోజకవర్గాల వారీగా నాబార్డు, పాట్ హోల్స్, ఇతర గ్రాంట్లను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనుల గురించి ఆరా తీశారు. ఈ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్లు ఆర్ఎస్ ప్రసాద్, జీఎస్ఎస్ ప్రసాద్, జి.శారదాకుమారి, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఖరీఫ్‌నకు ఊపిరి

... 5వ పేజీ తరువాయి

సిద్ధం చేసుకున్న రైతులు నాట్లు వేసేందుకు వర్షాల కోసం ఎదురు చూశారు. రెండు రోజుల కిందట జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో అన్నదాతలు వ్యవసాయ పనులు మరింత ముమ్మరం చేస్తున్నారు. వెదజల్లే పద్ధతిలో వరి నాట్లు వేసిన రైతులు పొలాల్లో చేరిన వర్షపు నీటిని బయటకు పంపే పనుల్లో నిమగ్నమయ్యారు. కొన్ని చోట్ల దుక్కి, దమ్ము పనులు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 55 వేల హెక్టార్లలో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నట్టు వ్యవసాయాధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

రైతులకు అందుబాటులో కాంప్లెక్స్ ఎరువులు

జిల్లాలో రెండు వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. జిల్లాలో మంగళవారం నాటికి 10 వేల హెక్టార్లలో వరి నాట్లు పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం పొలాల్లో పుష్కలంగా నీరు చేరడంతో ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా మూడు వేల హెక్టార్లలో వరి నాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ నెలాఖరు నాటికి 40 వేల హెక్టార్లలో వరి నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. రైతులు దమ్ములో యూరియా వేసేందుకు మొగ్గు చూపడం సరికాదని, దమ్ములో కాంప్లెక్స్ ఎరువులు వేయాలని సూచించారు. డీఏపీలో కూడా నత్రజని ఉన్నందున దమ్ములో ఏడీపీ వేయాలన్నారు. జిల్లాలో రైతు సేవా కేంద్రాల్లో కాంప్లెక్స్ ఎరువులు రెండు వేల టన్నుల వరకు అందుబాటులో ఉన్నాయన్నారు. డీఏపీ బస్తా రూ.1,350కి అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

గొలుగొండ మండలంలో..

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలో మంగళవారం రైతులు దుమ్ములు, వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, ఏఎల్‌పురం, సీహెచ్ నాగాపురం, తదితర గ్రామాల్లో రైతులు వరినాట్లతో పాటు ట్రాక్టర్‌తో దమ్ములు చేయిస్తున్నారు. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఖరీఫ్, రబీ వరినాట్లకు ఇబ్బందులు తొలగినట్టేనని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్ఈసీఎస్‌పై విచారణకు మోకాలడ్డు?

... 5వ పేజీ తరువాయి

ఎట్టకుండా, ప్రభుత్వ అనుమతి లేకుండా కోట్ల రూపాయల విద్యుత్ పరికరాలు కొనుగోలు చేశారు. అడ్డగోలుగా పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వాటిపై ఫిర్యాదులు అందడంతో ఈఆర్‌సీ చైర్మన్ తక్షణమే తమ ముందు హాజరై వివరాలు సమర్పించాలని ఎండీని ఆదేశించడంతో ఉద్యోగం పోతుందనే భయంతో చేసింది తప్పేనని ఒప్పుకొని ఆర్ఈసీఎస్‌ను 2021 సెప్టెంబరులో ఈపీడీసీఎల్‌కు అప్పగించారు. ఆ తరువాత వాటన్నింటిపై విచారణ చేయాలని సహకార శాఖకు చెందిన అధికారిణి శ్యామలను ఉన్నతాధికారులు ఆదేశిస్తే, ఎటువంటి తప్పులు జరగలేదని ఆమె నివేదిక ఇచ్చారు. ఇప్పుడు 51 విచారణ జరుగుతోంది. మరోవైపు ఈపీడీసీఎల్ అధికారులు సిబ్బంది సర్వీసు రిజిస్టర్లన్నీ తిరగేస్తున్నారు. అనర్హుల ఏరివేతకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఇవి ముందుకు సాగకుండా ఉండేందుకు ఉద్యోగులు కొందరు వినియోగదారుల పేరిట హైకోర్టును ఆశ్రయించి స్టే తేవాలని ప్రయత్నించారు. అటువంటి చర్యలు తగవని, వారిపై చర్యలకు ఆదేశించాల్సిన విజయవాడ అధికారి ఏమీ తెలియనట్టు, సమాచారం లేదని మిన్నకుండిపోయారు. ఇక్కడ అనకాపల్లి జిల్లా అధికారులు కూడా చర్యలకు తాత్సారం చేస్తున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

» కలెక్టర్ విజయకృష్ణన్


మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణాలు లక్ష్యంలో జిల్లాలో ఇంకా 4,328 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉందని, వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో గృహ నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు ఆర్థిక సహాయం ఉపయోగించి ఇళ్లను పూర్తి చేయించాలన్నారు. అదనపు ఆర్థిక సహాయం పొంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేయని వారి నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఏమినిటీ సెక్రటరీలతో రోజువారి సమీక్షలు నిర్వహించి, పురోగతిని సాధించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ వై. శ్రీనివాసరావు, డీఈఈలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలి : ఎస్పీ తుహిన్ సిన్హా


రాంబిల్లిలో రిసెప్షన్, కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

రాంబిల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రిసెప్షన్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్మించిన రిసెప్షన్, కౌన్సెలింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే నేరాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని, ఎటువంటి అలసత్వం ఉండకూడదని హెచ్చరించారు. పారిశ్రామిక ప్రమాదాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్‌లు ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తీవ్రమైన కేసుల సీడీఫైల్స్‌ను పరిశీలించి ఆయా కేసుల పురోగతిని తెలుసుకొని, సూచనలు చేశారు. సీజ్ చేసిన వాహనాలకు ట్యాగ్‌లు వేయాలన్నారు. పూర్తికాని కేసులలో విచారణ వేగవంతం చేయాలన్నారు. రౌడీషీటర్స్, చెడు నడత కలిగిన వ్యక్తుల వివరాలను తెలుసుకొని, ప్రస్తుతం వారు జీవనోపాధికి ఏ పనులు చేస్తున్నారో ఆరా తీశారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ సిబ్బంది సమస్యలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సర్కిల్ సీఐ సీహెచ్‌నర్సింగరావు, ఎస్ఐ డి.నాగేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులోకి తీసుకురావాలి

'డయల్ యువర్ డీఎం'తో ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఇతర డిపోల నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులను అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన బల్లా నాగభూషణం కోరారు. మంగళవారం ఆర్టీసీ డిపోలో 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని డిపో అసిస్టెంట్ మేనేజర్ గౌరి నిర్వహించారు. బస్ స్టేషన్‌లో ఇండియన్ మరుగుదొడ్లు ఉండడంతో సీనియర్ సిటిజెన్లు ఇబ్బందులు పడుతున్నారని, వెస్ట్రన్ టాయిలెట్స్ అందుబాటులోకి తీసుకురావాలని అనకాపల్లికి చెందిన డి.విశ్వనాథం కోరారు. అనకాపల్లి నుంచి జి.మాడుగులకు బస్ సౌకర్యం కల్పించాలని పాడేరుకు చెందిన ఎం.అప్పారావు విన్నవించారు. పరవాడ-అనకాపల్లి మధ్య బస్ సదుపాయం కల్పించాలని వాడచీపురుపల్లికి చెందిన ప్రభాకర్‌మూర్తి కోరారు. అడ్డరోడ్డు జంక్షన్‌లో బస్సు వేళల బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని అనకాపల్లికి చెందిన వరహాలరావు విన్నవించారు. పాయకరావుపేట-అనకాపల్లి మధ్య బస్సును ఎస్.రాయవరం మీదుగా నడపాలని సైతారుపేటకు చెందిన వి.అప్పలస్వామినాయుడు కోరారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని డిపో అసిస్టెంట్ మేనేజర్ గౌరి తెలిపారు.

మే నెలకు ఈఎస్ఐ ఆసుపత్రి పూర్తి : కలెక్టర్

అచ్యుతాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మే నెలకు ఈఎస్ఐ ఆసుపత్రి పూర్తవుతుందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. మంగళవారం ఆమె పూడిమడక రోడ్డులో రెండెకరాల్లో నిర్మిస్తున్న ఈఎస్ఐ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. మూడంతస్తు శ్లాబ్ పనులు పూర్తయాయి. గదులు నిర్మాణాలు, లిఫ్ట్, ప్లాస్టరింగ్ పనులు చురుకుగా జరుగుతున్నాయి. మే నెలకు పనులు పూర్తవుతాయని కలెక్టర్‌కి కాంట్రాక్టర్ తెలిపారు.

కానిస్టేబుల్ అభ్యర్థులు 22న హాజరుకావాలి

విశాలాక్షినగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులు ఈనెల 22న కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు పరేడ్ మైదానం వద్ద హాజరుకావాలని అనకాపల్లి ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. సెలక్షన్స్ సమయంలో సమర్పించిన ఒరిజనల్ సర్టిఫికెట్స్, గజిటెడ్ అధికారితో సంతకం చేయించిన మూడు సెట్ల జెరాక్స్ కాపీలు, మూడు కలర్ ఫొటోలతో ఉదయం ఏడు గంటలకే చేరుకోవాలన్నారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోండి : రత్నాకర్

మునగపాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాలువల ద్వారా వస్తున్న నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ సూచించారు. మండలంలో తోటాడ, మూలపేటల్లో అనకాపల్లి ఆవకాలువపై ఉన్న రెగ్యులేటర్లను మంగళవారం ఆయన పరిశీలించారు. రెగ్యులేటర్ల గేట్లు ఏ విధంగా పనిచేస్తున్నది రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మూలపేటలో గంగాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

డోర్ టూ డోర్ శానిటేషన్ పనుల పరిశీలన

నక్కపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోసలపాడు గ్రామంలో మంగళవారం డోర్ టూ డోర్ శానిటేషన్ పనులను ఎంపీడీవో డీ సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పరిశీలించారు. ప్రతీ ఇంటి నుంచి సకాలంలో తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లను ఆదేశించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని నిరసన

అనకాపల్లి టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్ ప్రయాణం అమలుతో ఆదాయం కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల గోవింద్ డిమాండ్ చేశారు. పట్టణంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, కార్మికులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి ర్యాలీగా బయలుదేరి నెహ్రూచౌక్‌లో మానవహారం నిర్వహించారు. అక్కడ నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. అనంతరం ఏవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఆదాయం చూపించాలని, లేదంటే ఆర్టీసీలో ఆటో డ్రైవర్లకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోరిబిల్లి జగదీశ్, నాయకులు పి.అంజి, పి.రాము, కె.నాగరాజు, బాపునాయుడు పాల్గొన్నారు.

వండర్‌కిడ్ ఆరాధ్యకు అభినందనలు

పరవాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో పేరు నమోదు చేసుకున్న బాపడుపాలెం పాఠశాల ఒకటో తరగతి విద్యార్థిని ఆరాధ్య బెహరాను తపాలా శాఖ అధికారులు మంగళవారం అభినందించారు. సూపరింటెండెంట్ చుక్క శ్రీనివాసరావు, పరవాడ, భరణికం సబ్ పోస్టుమాస్టర్లు కేవీవీఎస్ గుప్తా, దాట్ల వరహాలరాజు విద్యార్థిని ఆరాధ్యకు బ్యాగ్, పలు బహుమతులు అందించి అభినందనలు తెలిపారు. సుకన్య సమృద్ధి యోజన పథకంలో భాగంగా ఆరాధ్య పేరుతో అకౌంట్ తెరిపించారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయుడు గంగాధరరావును సత్కరించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ఎస్.రాయవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరాపల్లి గ్రామంలో మంగళవారం ఎస్.రాయవరం పీఏసీఎస్ సీఈవో వీసం భాస్కరరావు ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై స్థానిక రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు రైతులకు సమాచార హక్కు చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ తుమ్మపాల నాగేశ్వరరావు, కాలపురెడ్డి రమణ, గారా చినఅప్పారావు, స్థానికులు పాల్గొన్నారు.

736 కిలోల గంజాయి స్వాధీనం

... 5వ పేజీ తరువాయి


పాయకరావుపేట పోలీసులు పట్టుకున్న గంజాయి, కారు, నిందితులు

గంజాయి లభ్యమైంది. నిందితులు ఒడిశా రాష్ట్రం చిత్రకొండలో గంజాయిని కొనుగోలు చేసి తమిళనాడుకు రవాణా చేయడానికి ప్రయత్నిస్తూ పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో తమిళనాడు రాష్ట్రం తిరువళ్ళూరుకి చెందిన తరుణ్‌కుమార్, చింతపల్లి మండలం దోమలగొంది గ్రామానికి చెందిన గడుగు కొండబాబు, చిత్తూరు జిల్లా సత్యవేడుకి చెందిన డ్రైవర్ ఎ.దినేశ్ ఉన్నారు.

పాయకరావుపేటలో 200 కిలోలు

పాయకరావుపేట మండలంలోని సీతారాంపురం జంక్షన్ వద్ద పోలీసులు సోమవారం 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. మంగళవారం పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో నర్సీపట్నం డీఎస్పీ కె.శ్రీనివాస్ ఈ వివరాలు వెల్లడించారు. గొలుగొండ మండలం రావణాపల్లి సమీపంలో ఏటిగైరమ్మపేట గ్రామానికి చెందిన గంజాయి స్మగ్లర్ గొర్లి గంగునాయుడు ఇటీవల ఒడిశా నుంచి ఏజెన్సీలోని లంబసింగికి తెచ్చిన 200 కిలోల గంజాయిని ఆటోలో గబ్బాడ మీదుగా నర్సీపట్నం తీసుకువచ్చి అక్కడి నుంచి కారులో నక్కపల్లి మండలం నెల్లిపూడి గ్రామంలో ఒక తోటలో డంప్ చేశాడు. దీనిని సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామానికి చెందిన బైపురెడ్డి రత్నం కారులో రాజమహేంద్రవరానికి తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో పాయకరావుపేట సీఐ జి.అప్పన్న, ఎస్ఐ పురుషోత్తం తమ సిబ్బందితో మండలంలోని సీతారాంపురం జంక్షన్ వద్ద పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని బైపురెడ్డి రత్నంతోపాటు తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటకు చెందిన ఎర్రమిల్లి నాగవీరశివ, కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం సిరిపురానికి చెందిన కోళ్ల నాగసతీశ్‌లను అరెస్టు చేశారు.

క్రైం... crime news

చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తెలిపారు. ఈనెల 16వ తేదీ రాత్రి ఫూల్‌బాగ్ రోడ్డులోకి వెళ్లే సమయంలో లారీ ఢీకొనడంతో ఆటోడ్రైవర్ నమ్మి రమణ, విజయరామరాజుపేటకు చెందిన సుందరపల్లి లోకేశ్ గాయపడ్డారు. ఇద్దరికి ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ నమ్మి రమణ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ శేఖరం తెలిపారు.

అశ్లీల నృత్యాల నిర్వాహకులపై కేసు : సీఐ


అశ్లీల నృత్యాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ ధనుంజయరావు

ఎలమంచిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏటికొప్పాకంలో శ్రీకృష్ణాష్టమి కార్యక్రమంలో అశ్లీల నృత్యాలు నిర్వహించిన నిర్వాహకులపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు సీఐ ధనుంజయరావు తెలిపారు. అశ్లీల నిర్వాహకులను స్టేషన్‌కు పిలిపించుకొని ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కార్యక్రమానికి బాధ్యులైన ఏడుగురు కమిటీ ప్రతినిధులపై కేసు నమోదు చేశామన్నారు. ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజీ ప్రోగ్రామ్‌లు అయినా మైక్ నిర్వహణ అనుమతి కోసం పోలీసులను సంప్రదించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని సీఐ ధనుంజయరావు తెలిపారు.

లాడ్జీలో పేకాట ఆడుతున్న ముగ్గురి అరెస్టు

» 29,300 నగదు, 3 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

ఎలమంచిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ లాడ్జీలో పేకాట ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు. మంగళవారం రాత్రి లాడ్జీలు తనిఖీ చేస్తుండగా ఓ రూములో డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.29,300 నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సావిత్రి తెలిపారు.

గుట్టుగా మత్తు మాత్రల తయారీ

డీఆర్ఐ అధికారుల తనిఖీలు

రూ.23.88 కోట్ల విలువైన 119.4 కేజీల మిశ్రమం స్వాధీనం

అచ్యుతాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-రాంబిల్లి మండలాల పరిధిలోని ఫార్మా కర్మాగారాల్లో గుట్టుచప్పుడు కాకుండా ఆల్ప్రాజోలం (మత్తు మాత్రలు) తయారీని కేంద్ర ప్రభుత్వానికి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్సీ (డీఆర్ఐ) అధికారులు పట్టుకున్నారు. రాంబిల్లి మండలం లాలంకోడూరు పరిధిలోని ఎవరెక్స్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారంలో మత్తు మాత్రలు తయారవుతున్నట్టు డీఆర్ఐ అధికారులకు సమాచారం అందింది. దీంతో వీరు ఆదివారం అర్ధరాత్రి వరకు కర్మాగారంలో సోదాలు జరిపారు. ఈ మాత్రలు తయారీకి ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులను ఇక్కడకు తీసుకువచ్చారని తెలిసింది. ఇక్కడ తయారైన మత్తు మాత్రలు కల్లు తయారీతో పాటు వివిధ రకాల పదార్థాల్లో కలిపి విక్రయిస్తున్నట్టు సమాచారం. ఈ సోదాల్లో రూ.23.88 కోట్ల విలువైన 119.4 కేజీల రసాయన మిశ్రమంతోపాటు 87.8 కేజీల ముడి సరుకు, 3600 లీటర్ల ముడిద్రవం స్వాధీనం చేసుకున్నారని తెలిసింది. వీటి తయారీని చేస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరు గతంలో నేరచరిత్ర కలిగిన వారుగా అధికారులు గుర్తించినట్టు తెలిసింది.

తమకు ఎటువంటి సంబంధం లేదు

ఎవరెక్స్ కంపెనీ ఎండీ నాగశేఖర్

మత్తు మాత్రలు తయారీకి, తమ కర్మాగారం యాజమాన్యానికి ఎటువంటి సంబంధం లేదని ఎవరెక్స్ కర్మాగారం ఎండీ ఆర్. నాగశేఖర్ మంగళవారం ఒక ప్రకటకలో తెలిపారు. ప్రస్తుతం తమకు ఆర్డర్లు లేక ఇబ్బందుల్లో ఉన్నామని, అయితే పశువులకు వినియోగించే మాత్రలు తయారు చేస్తామని, తర్వాత తమ కర్మాగారానికి భారీగా ఆర్డర్‌లు ఇస్తామని తమ జీఎంని మోసగించి మత్తు మాత్రలు తయారు చేశారన్నారు.ఈ విషయంలో తాము బాధితులమేనని అన్నారు.

దమ్ములో డీఏపీ వాడాలి

» జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు


రైతులతో కలిసి వరినాట్లు వేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, ఏవో ఉమాప్రసాద్

నక్కపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వరిసాగు చేసే రైతులు దమ్ము సమయంలో డీఏపీ వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బీ మోహన్‌రావు సూచించారు. మండలంలోని వేంపాడు, చినరాంభద్రపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా క్షేత్ర పర్యటన చేశారు. వరి పొలాలను పరిశీలించారు. రైతులతో కలిసి జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, ఏవో ఉమాప్రసాద్ వరినాట్లు వేశారు. వరి పంట కాలంలో 32 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాషియం ఇచ్చే ఎరువులను వేసుకోవాలని సూచించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు: ఏడీ



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీ మోహనరావు

డుంబ్రిగుడ, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని సబ్ డివిజన్ వ్యవసాయశాఖ సంచాలకులు మోహనరావు హెచ్చరించారు. ఆయన మంగళవారం మండల పరిధి అరకు పంచాయతీ కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములోని ఎరువుల నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎరువుల నిల్వలపై ప్రతి రోజూ మండల వ్యవసాయ అధికారికి సమాచారం అందించాలని ఆదేశించారు. ఎరువుల కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదులను అందించాలన్నారు. దుకాణం బయట ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారి వాసుదేవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప వృత్తి ఫొటోగ్రఫీ



ఫొటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బందికి స్వీట్లు అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు

చింతపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఛాయా చిత్రాలతో సమాచార సేకరణ, వివిధ సమస్యలను బాహ్య ప్రపంచానికి చూపించే గొప్ప వృత్తి ఫొటోగ్రఫీ అని స్థానిక ఏరియా ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి అన్నారు. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని తాలూకా ముత్యాలమ్మ ఫొటోగ్రాఫర్ యూనియన్ నాయకులు, సభ్యులు మండల కేంద్రంలో ర్యాలీ చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులు పండ్లు, రొట్టెలు అందజేశారు. వైద్య సిబ్బందిరి స్వీట్లు పంపిచిపెట్టారు. ఈసందర్భంగా ఏరియా ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీని శాస్త్రవేత్త లూయిస్ డాగ్యురే కనుగొన్నారన్నారు. నాటి నుంచి ఫొటోగ్రఫీలో కొత్త అధ్యాయం ప్రారంభమైందన్నారు. 1839న మొదట ఫ్రెంచ్ ప్రభుత్వం ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఫొటోగ్రాఫర్లు మంచి చిత్రాలను వెలుగులోకి తీసుకు రావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అల్లంగి శ్రీను, ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు, గోపి, సురేశ్, నాగేశ్, శివ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన జనసేన ఐటీ టీమ్ కో-ఆర్డినేటర్



ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్‌ను సన్మానించిన కో-ఆర్డినేటర్ అనిల్‌కుమార్

పాడేరురూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌ను అల్లూరి జిల్లా జనసేన పార్టీ ఐటీ టీమ్ కో- ఆర్డినేటర్ సీహెచ్ అనిల్ కుమార్ మంగళవారం ఆయన స్వ గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. జనసేన పార్టీలో నాయకర్ అందిస్తున్న సేవలను కొనియాడారు. గిరిజన ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను ఆయనకు వివరించినట్టు చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా కొల్లో సొన్ను



గూడెంకొత్తవీధి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కిల్లో సొన్ను నియమితులయ్యారు. మంగళవారం ఈ మేరకు నియామకపత్రాన్ని జిల్లా అధ్యక్షుడు శతక బుల్లిబాబు అందజేశారు. ఈసందర్భంగా కిల్లో సోన్ను విలేకరులతో మాట్లాడుతూ తనను మండలాధ్యక్షుడిగా నియమించడంపై జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అధి కార ప్రతినిధి కంకిపాటి వీరన్నపడాల్‌కి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.



గూడెంకాలనీ వద్ద బురదమయమైన రహదారి



కేంద్ర కాఫీ బోర్డు ప్లాంటేషన్ ఎదుట గోతులు

అధ్వానంగా అంతర్ రాష్ట్ర రహదారి

- అర్‌వీనగర్ నుంచి నూతిబంద వరకు గోతులు, బురదమయం
- వాహన చోదకుల అవస్థలు వర్ణనాతీతం

గూడెంకొత్తవీధి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీలేరు-చింతపల్లి అంతర్‌రాష్ట్ర ప్రధాన రహదారి వర్షాలకు అత్యంత అధ్వానంగా మారింది. ఆర్‌వీనగర్ నుంచి నూ తిబంద వరకు 14 కిలోమీటర్లు భారీ గోతులు, బురద మయంగా మారడంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిలో భద్రాచలం, మల్కన్‌గిరి, ఛత్తీస్‌గఢ్, హైదరాబాద్ ప్రాంతాలకు ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్‌వీనగర్ నుంచి నూతిబంద వరకు పూర్తిగా రహదారి భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో పోలీసులు గోతుల్లో మట్టితో పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ రహదారి బరదగా మారిపోయింది. దీంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈరహదారిపై అవగాహనలేకుండగా హైదరాబాద్, భద్రచలం, ఒడిశా ప్రాంతాల నుంచి లంబసింగి, అరకు ప్రాంతాలకు సొంత వాహనాల్లో ప్రయాణించే పర్యాటకుల ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ మార్గం లో ప్రయాణించిన వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ప్రాంతీయులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ రహదారి మరమ్మతులపై ఆర్‌అండ్‌బీ అధికారులు కనీస చర్యలు తీసుకోవడంలేదు. ఇప్పటికైనా ఈ రోడ్డు అభివృద్ధిపై కలెక్టర్, కూటమి పాలకులు చర్యలు తీసుకోవాలని ప్రాంతీయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శక్తి యాప్‌పై అవగాహన అవసరం: ఎస్ఐ



కళాశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్ఐ శంకరరావు

కొయ్యూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శక్తియాప్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మంప ఎస్ఐ శంకరరావు సూచించారు. మంగళవారం ఎస్ఐ కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కళాశాల విద్యార్థినులకు ఉమెన్‌సేఫ్టీ కార్యక్రమం నిర్వహి ంచారు. ఇందులో భాగంగా శక్తియాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ఈవ్ టీజింగ్, బాల్య వివాహాల వలన కలిగే కష్టనష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, పాఠశాల, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశుసంపద పరిరక్షణ



టోకూరులో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

అనంతగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టోకూరు పంచాయతీ కేంద్రంలో పాడి రైతులకు అనంతగిరి పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు మంగళవారం అవగాహన కల్పించారు. ముందుగా పశువుల ఆరోగ్యంపై అడిగితెలుసుకున్నారు. వర్షాలు నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పశువులు వ్యాధులకు గురైతే పశువైద్య సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. పశువులకు సంబంధించి టీకాలను రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంచామన్నారు. అలాగే పశువులు మృత్యువాతపడితే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. సిబ్బంది మూర్తి, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



దుర్గమ్మను దర్శించుకున్న జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు, భక్తులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు జల్లిపల్లి సుభద్ర, మూర్తి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజ, పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో చండీ హోమం నిర్వహించారు. దుర్గమ్మతల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీసా సుభాస్, ఆలయ కమిటీ ప్రతినిధులు మధుసూదనరావు, శంకర్, నాగమణి, బాబూరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవం



పాడేరులో ర్యాలీ చేపడుతున్న ఫొటో, వీడియో గ్రాఫర్‌లు

పాడేరురూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఛాయచిత్ర దినోత్సవంను అల్లూరి జిల్లా ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వరరావు, గౌరవాధ్యక్షుడు డి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. అసోసియేషన్ పాడేరు అధ్యక్షుడు పి.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి మాట్లాడుతూ ఫొటోలు తీయడం అనేది ఒక కళ అన్నారు. ఈ కళలో మరింత నైపుణ్యం పెంపొందించుకుని ఫొటో, వీడియో గ్రాఫర్‌లు ఆర్థికంగా మరింత ఎదగాలన్నారు. ఈసందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు ఆదివాసీ విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు టి.మహేశ్వరరావు, కార్యదర్శి కృష్ణారావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఆర్ఏ అధ్యక్షులు సూర్యారావు, కార్యదర్శి మత్స్యరాజు, ఆదివాసీ విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు టి.మహేశ్వరరావు, కార్యదర్శి కృష్ణారావు, మదర్ థెరీసా కళాశాల ప్రిన్సిపాల్ ఆనందరావు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, జిల్లా పరిధిలోని వివిధ మండలాల ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో మంగళవారం ఫొటోగ్రాఫర్స్ డేను మల్టీ ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ఆ ధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఫొటోగ్రఫీ శాస్త్రవేత్తలు లాయిస్ డ్యాగ్యురే, జోసెఫ్ నీసోఫర్ నీప్సల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.యూనియన్ అధ్యక్షుడు సన్యాసిరావు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విక్రమ్, అనిల్, రాము తదితరులు పాల్గొన్నారు.

జలాశయాల దిగువ గ్రామాల ప్రజలు అప్రమత్తం ఉండాలి

- తహశీల్దార్ శంకరరావు



జోలాపుట్టు జలాశయంలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న తహశీల్దార్

ముంచంగిపుట్టు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జోలాపుట్టు, డుడుమ జలాశయాల దిగువ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ కె.శంకరరావు అన్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు గరిష్ఠస్థాయికి చేరుకుంటున్నట్టు 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది జోలాపుట్టు జలాశయాన్ని మంగళవారం సందర్శించారు. నీటి మట్టం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ జలాశయంలో 2750 అడుగుల నీటిని నిల్వ సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం 2745.30 అడుగుల మేర నీరు చేసినట్టు చెప్పారు. అలాగే మరో రెండు రోజుల్లో నీటిని విడుదల చేసే అవకాశం ఉందని అన్నారు. నీటి విడుదలపై ముందస్తు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ జలాశయం అధికారులను కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఆ రెండు జలాశయాల దిగువ ప్రాంతాల్లో ఉన్న సుమారు 30 గ్రామాల ప్ర జలు అప్రమత్తంగా ఉండాలని, జలాశయాల్లో త్వరలో నీటిని విడుదల చేసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే తుఫాన్ వలన ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే సహకారం అందిస్తామని అన్నారు.

అసంపూర్తిగా బొండాం-కొత్తవలస గ్రామ రహదారి

- రాకపోకలకు అవస్థలు
- పూర్తి చేయాలని అభ్యర్థన

అరకులోయ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొండాం పంచాయతీ పరిధి బొండాం కొత్తవలస గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణం అసంపూర్తిగావదిలేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సగం రోడ్డుకు సంబంధించి వెట్‌మిక్స్ వేసి రోలింగ్ పనులు చేపట్టి ఇటీవల వర్షాల కారణంగా పనులు నిలిపివేశారు. తారురోడ్డు పనులు చేపట్టకపోవడంతో కంకర బయటకు వచ్చేస్తుండడంతో టూవీలర్స్ ఫోర్‌వీలర్స్ నడిపేందుకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సగం మేర వేసిన తారురోడ్డులో జయంతివలస- పెద్దగెడ్డ వంతెన మధ్య పైప్‌లతో కల్వర్టు నిర్మించకుండా వదిలేశారు. ఈ కల్వర్టు నిర్మించాల్సిన చోట వర్షాలకు వాహనాలు బురదలో కూరుకుపోయి నానా అవస్థలు పడాల్సివస్తుందని బొండాం కొత్తవలస, కొల్యాగుడ, బొండ్యిగుడ గ్రామ గిరిజనులు వాపోతున్నారు. తక్షణం టీడబ్ల్యూ ఇంజనీరింగ్ అధికారులు జయంతివలస గ్రామ సమీపంలో పైప్‌కల్వర్టును నిర్మించడంతోపాటు సగం మేర తారురోడ్డు నిర్మాణానికి వెట్‌మిక్స్ వేసి వదిలేసిన మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చ చేయాలని బొండాం కొడాంకొత్తవలస, బొండ్యాగుడ తదితర గ్రామాల గిరిజనులు ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నారు.



బురదయంగా జయంతివలస- పెద్దగోడ్డ మార్గంలో కల్వర్ట్ నిర్మించాల్సిన రోడ్డు



వెట్‌మిక్స్ వేసి వదిలేసిన రహదారి

21న మెగా రక్తదాన శిబిరం

కొయ్యూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దివంగత బీజేపీ నేత లోకుల గాంధీ 4వ వర్ధంతిని పురస్కరించి శరభన్నపాలెంలో ఈ నెల 21న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ది తోడు లోకుల గాంధీ ట్రస్టు సభ్యులు, బీజేపీ మండల నేతలు తెలిపారు. గాంధీ ప్రియ శిష్యుడు మనోజ్ ఆధ్వర్యంలో సికిల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించనున్నట్టుగా తెలిపారు. 2024-25 లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సా.దించిన విద్యార్థులకు ఈ సందర్భంగా గాంధీ స్మారక స్కాలర్ షిప్‌లుఅందచేయనున్నట్టు చెప్పారు. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొవాలని కోరారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల దరఖాస్తు గడువు పెంపు

పాడేరురూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఏపీవోఎస్ఎస్) ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి, ఇంటర్మీడియట్ తరగతులల్లో ప్రవేశాలు పొందేందుకు లేటు ఫీజు రూ. 200తో సెప్టెంబరు 15వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని డీఈవో పి.బ్రహ్మాజీ రావు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ (ప్రభుత్వ పరీక్షలు) శశికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.10వ తరగతిలో చేరేందుకు 14 సంవత్సరాలు, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు 15 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యాసకులు సమాచారం కోసం ఏపీ వోఎస్ఎస్ వెబ్‌సైట్‌లో లేదా మీకు సమీపంలో ఉన్న ఏ1 సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

యువజనోత్సవ జిల్లా స్థాయి క్విజ్ పోటీలు



విజేతలకు ధ్రువపత్రాలు అందిస్తున్న డీఐఈవో, వైద్య ఆరోగ్య శాఖాధికారులు

పాడేరురూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యువజనోత్సవాలు సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలు విజయవంతమైనట్టు లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్. కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించామన్నారు. ముందుగా విద్యార్థులకు యువజనోత్సవాల ప్రచారంపై అవగాహన కల్పించామన్నారు. ఉత్తమ పౌరులుగా ఎదగాలని, మంచి అలవాట్లను నేర్చుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వి. శివ ప్రథమ, ఎస్.చరిత ద్వితీయ, డుంబ్రిగుడ జీజే.కళాశాలకు చెందిన కె.దిలీప్ కుమార్ తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. వీరికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎస్.భీమశంకరరావు, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ చీపురు రమాదేవీ ధ్రువ పత్రాలను అందించారు యువజనోత్సవాల్లో భాగంగా రెండు నెలలు పాటు జిల్లా వ్యాప్తంగా యువతకు హెచ్ఐవీ, ఎయిడ్స్ లైంగికంగా సంక్రమించే వ్యాధులు, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కళాశాల అధ్యాపకులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం డీఎండీవో చిరంజీవి పాల్గొన్నారు.

ప్రకృతి సాగు లాభదాయకం: శాస్త్రవేత్త బయ్యపురెడ్డి



విజేతలకు ధ్రువపత్రాలు అందిస్తున్న డీఐఈవో, వైద్య ఆరోగ్య శాఖాధికారులు

చింతపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు లాభదాయకమని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి అన్నారు. మంగళవారం పెదబరడ గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆదివాసీ రైతులు పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేసుకోవాలన్నారు. ద్రవ, ఘన జీవామృతం, కషాయాలు మాత్రమే వినియోగించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునన్నారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తులకు అదనపు ధర లభిస్తుందన్నారు. అలాగే, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలకు పెద్దగా నష్టంలేదన్నారు. రైతులు పంట పొలాల్లో నిలువనీరు లేకుండగా చూసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలు, సూచనలు, సలహాల కోసం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించాలన్నారు. అనంతరం ఘన, ద్రవ జీవామృతం, కషాయాలు తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి, శాస్త్రవేత్త జోగారావు, ఏవో టి. మధుసూదనరావు, ఆత్మ ఏటీఎం మహేశ్వరి, జనసేన జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారామ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెమ్మెలి అబ్బాయినాయుడు, సర్పంచ్ సమిడి గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు లోవరాజు, ఏఎంసీ డైరెక్టర్ కేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కారానికి కృషి: జడ్పీ చైర్‌పర్సన్




విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర హామీ ఇచ్చారు. మండలంలోని కరిమకుఖిపుట్టు పంచాయతీ కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌ను మంగళవారం ఆమె సందర్శించి, తనిఖీ చేశారు. పాఠశాల విద్యా కమిటీ, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు 192 మంది విద్యార్థులు ఉన్నారని, సరిపడే భవనాలు లేక అవస్థలు పడుతున్నట్టు ఉపాధ్యాయులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని సుభద్ర ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్య ఎంతో కీలకమని, ప్రతీ ఒక్కరూ క్రమ శిక్షణతో చదువుకోవాలని ఆమె విద్యార్థులకు సూచించారు. గ్రామంలో జడ్పీ పాఠశాల ఏర్పాటుకు కృషి చేసిన జడ్పీ చైర్‌పర్సన్‌కు పాధ్యాయులు, గ్రామసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపడీవో సూర్యనారాయణమూర్తి, ఎంఈవో కృష్ణమూర్తి, సర్పంచ్ పుల్‌మొత్తి, వైసీపీ నేతలు పద్మారావు, రాంప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మండల నూతన కమిటీ ఎంపిక

పాడేరురూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల నూతన కమిటీని మంగళవారం ఎంపిక చేసినట్టు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సమావేశంలో మండల కన్వీనర్‌గా మాదెల ప్రసాదరావు, కో-కన్వీనర్లుగా ఆర్.ముత్యాలమ్మ, జె.సంజీవరావు ఎంపిక చేసినట్టు చెప్పారు. కమిటీ సభ్యులుగా కార్మిక సంఘాల నుంచి 20 మం దితోపాటు అంగన్‌వాడీల నుంచి అంబిక, సీహెచ్‌డబ్ల్యూల నుంచి నాగమణి, సర్వశిక్షాభియాన్ నుంచి జయరాజు, మెడికల్ కళాశాల నుంచి ప్రసాద్, సెక్యూరిటీ గార్డుల నుంచి ఎస్.బాలన్న, ఆర్‌టీసీ నుంచి భరత్, ముఠా నుంచి సూరిబాబు, మెడికల్ అండ్ హెల్త్ నుంచి లక్ష్మణ్, పంచాయతీ నుంచి అప్పారావు, జీసీసీ నుంచి కుమార్, కాఫీ నుంచి దేవి, వెలుగు వీవోల నుంచి సువర్ణ, ఎండీఎం నుంచి సరస్వతి, హాస్టల్ వర్కర్స్ ఐటీడీఏ కాఫీ, ఆశా, విద్యుత్, ఉపాధి పథకం నుంచి ఒకొక్కరిని ఎంపిక చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు రెండు వాహనాల కేటాయింపు



ద్విచక్ర వాహనాలపై పోలీసులు

అనంతగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీకి ముఖద్వారంతోపాటుగా బొర్రా, తాటిగుడ, కటికి, కాఫీ ప్లాంటేషన్ తదితర పర్యాటిక సందర్శిత ప్రాంతాలు మండలంలో అధికంగా ఉన్నాయి. అరకు-విశాఖ ప్రధాన రహదారి చిలకలగెడ్డ నుంచి శివలింగపురం మీదుగా భీసుపురం వరకు ఘాట్‌రోడ్డు మండల పరిధిలోకి వస్తోంది.. ఈనేపథ్యంలో మన్యం అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఈ రోడ్డుమార్గంలో ప్రయాణిస్తుండడంతో ఘాట్‌రోడ్డు, బొర్రా-ములియగుడ అప్పుడప్పుడు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని, అల్లూరి జిల్లా పోలీస్‌శాఖ ప్రత్యేక చొరవ తీసుకుని, అనంతగిరి పోలీస్‌స్టేషన్ రెండు అత్యాధునిక సాంకేతికతో కూడిన రెండు ద్విచక్ర వాహనాలను కేటాయించారు. వాటి ద్వారా పోలీస్ సిబ్బంది, ట్రాఫిక్ నియంత్రణంకు చర్యలు చేపట్టనున్నట్టు స్థానిక ఎస్ఐ డి.శ్రీనివాసరావు ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పోలీస్‌శాఖ చేపట్టిన చర్యలపై పర్యాటకులు, వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పీజీఆర్‌ఎస్ ఫిర్యాదుపై విచారణ చేస్తున్న తహశీల్దార్

పీజీఆర్‌ఎస్ ఫిర్యాదుపై విచారణ

మాకవరపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో జి.కోడూరు గ్రామంలో ప్రభుత్వ భూమిని జిరాయితీ భూమిగా మార్పు చేశారంటూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఫిర్యాదు అందింది. దీంతో తహశీల్దార్ జి.వెంకటరమణ మంగళవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి.కోడూరు గ్రామంలో 494 సర్వే నంబరులో 1.2 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండేదని చెప్పారు. ఈ భూమి ప్రస్తుతం 3210లో 494-1-ఏ-2బీ సర్వే నంబరుగా, రాజాసాగి వెంకటసుభద్రయ్యమ్మ పేరుమీద మార్చాలని గ్రామానికి చెందిన మళ్ల సత్తిబాబు అనే వ్యక్తి పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న రావణాపల్లి రిజర్వాయర్



పొర్లుపై నుంచి 30 క్యూసెక్కుల నీటి అవుట్ ఫ్లో

గొలుగొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్ పొంగి పొర్లుతోంది. పొర్లుపై నుంచి 30 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో జరుగుతోంది. గొలుగొండ, నర్సీపట్నం మండలాలకు సుమారు 2900 ఎకరాలకు సాగునీరు అందించేందుకు కనిష్ఠంగా 350 అడుగులు, గరిష్ఠంగా 380 అడుగుల నీటిమట్టం నిల్వలు ఉండే విధంగా రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రిజర్వాయర్ ఎగువ ప్రాంతం కొయ్యూరు మండలం రాళ్లగెడ్డ నుంచి 30 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతుంది. దీంతో రిజర్వాయర్ నిండుకుండలా కనిపిస్తున్నది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటల సాగుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో అతిథి అధ్యాపకులుగా పని చేయాలనుకునే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా విద్యాశాఖాధికారి మద్దిలి వినోద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంతి అధ్యాపకులు, విశ్రాంతి స్కూల్ అసిస్టెంట్‌లు, ఇప్పటికే పనిచేస్తున్న అధ్యాపకులు అర్హులన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 50 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీన ఒరిజినల్, జెరాక్స్ కాపీలను సంబంధిత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అందజేయాలని తెలిపారు. 22వ తేదీన అనకాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని ఆయన తెలిపారు.

ఉచిత ప్రయాణం బస్సులకు ఆదరణ

విశాఖపట్నం రూటులో ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ లేడీస్‌తో ఫుల్

రోజురోజుకూ పెరుగుతున్న రద్దీ.. నాన్‌స్టాప్ సర్వీసులకు తగ్గిన ఆదాయం

నర్సీపట్నం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మగువల కోసం ప్రతిష్టాత్మంగా ప్రవేశ పెట్టిన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకానికి రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోంది. శని, ఆదివారం సెలవు దినాలు కావడంతో ఉచిత టిక్కెట్‌తో ప్రయాణం చేసే మహిళల సంఖ్య తగ్గినా, సోమవారం భారీగా పెరిగింది. నర్సీపట్నం డిపోలో ఆర్టీసీ బస్సులు 74, అద్దె బస్సులు 28 కలిసి మొత్తం 102 ఉన్నాయి. వీటిలో అల్ట్రా డీలక్స్ విశాఖపట్నం నాన్‌స్టాప్ బస్సులు 17, విజయవాడ, హైదరాబాద్, కాకినాడ సర్వీసులు మూడు, ఘాట్ రూట్ బస్సులు 18 తప్పించి, మిగిలిన 64 సర్వీసులు స్త్రీ శక్తి పథకంలో మహిళల కోసం ఉచిత ప్రయాణానికి కేటాయించారు. అడ్డరోడ్డు, చోడవరం, తుని రూటులలో బస్సులోని సీట్లు మహిళలతో నిండిపోతున్నాయి.

నర్సీపట్నం నుంచి విశాఖపట్నం రూటులో మహిళలు ఎక్స్‌ప్రెస్, బైపాస్ సర్వీసులను అధికంగా ఉపయోగించుకోవడంతో నాన్‌స్టాప్ బస్సులు పురుషులకే పరిమితమయ్యాయి. ఈ రూటులో గతంలో కంటే 15 శాతం ఓఆర్ పడిపోయింది. నర్సీపట్నం డిపోకి నాన్‌స్టాప్ సర్వీసులు ద్వారానే అదాయం అధికంగా వస్తుంది. గతంలో ప్రతీ రోజు 78 శాతం ఓఆర్ ఉంటే ఈ మూడు రోజులు 60 నుంచి 65 శాతానికి పడిపోయింది. స్త్రీశక్తి పథకం ప్రవేశ పెట్టిన తర్వాత శనివారం 70 శాతం ఓఆర్‌తో అన్ని సర్వీసుల ద్వారా రూ.9.42, స్త్రీశక్తికి కేటాయించిన బస్సుల ద్వారా రూ.3.33 లక్షలు ఆదాయం వచ్చింది. ఆదివారం 79 శాతం ఓఆర్‌తో రూ.9 లక్షలు సాధారణ ఆదాయం, ఉచిత టిక్కెట్‌పై రూ.4.88 లక్షల ఆదాయం వచ్చింది. సోమవారం 95 శాతం ఓఆర్‌తో సాధారణ ఆదాయం రూ.11.88 లక్షలు సమకూరింది.



విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కడానికి ఎగబడుతున్న మహిళలు

బస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు

▸▸ జిల్లా ప్రజా రవాణా అధికారిణి ప్రవీణ

కృష్ణాదేవిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్‌లో త్వరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రజా రవాణా అధికారిణి (డీపీటీవో) వి.ప్రవీణ తెలిపారు. మంగళవారం నర్సీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ ధీరజ్‌తో కలిసి స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం బస్‌స్టేషన్‌లో మహిళలతో స్త్రీశక్తి పథకం గురించి మాట్లాడి లోటుపాట్లను అడిగి తెలుకున్నారు. అలాగే బస్‌స్టేషన్ తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలను పరిశీలించి సమస్యపై ఆరా తీశారు. అనంతరం డీపీటీవో పవీణ మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం ద్వారా జిల్లాలో ప్రస్తుతం 70 శాతం మహిళలు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ఈ పథకం ద్వారా మహిళలకు ఉచిత టిక్కెట్‌ను ఇస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాల్లో కంటే స్త్రీశక్తి పథకం ద్వారా ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్టీసీ సేవలపై ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తక్షణమే ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కృష్ణాదేవిపేట బస్‌స్టేషన్‌లో త్వరలో సీసీ కెమెరాలు, ప్రయాణికులకు బస్ వేళలు తెలిపే సమాచారం తెలిపేలా బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికులకు మినరల్ వాటర్ సదుపాయాన్ని వినియోగంలోకి తేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాదేవిపేట బస్ స్టేషన్‌లో సదుపాయాలను పరిశీలిస్తున్న డీపీటీవో ప్రవీణ

41 హెక్టార్లలో మునిగిన వరి పొలాలు



పంట పొలాలను పరిశీలిస్తున్న ఏవో కృష్ణవేణి

చీడికాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా 41 హెక్టార్లలో వరి నాట్లు మునిగిపోయాయని మండల వ్యవసాయ అధికారి ఎ.కృష్ణవేణి తెలిపారు. జైతవరం గ్రామంలో ముంపునకు గురైన వరి పొలాలను మంగళవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జైతవరం, అర్జునగిరి, శిరిజాం, చీడికాడ, తురువోలు, తంగుడుపల్లి గ్రామాల్లో వరి పంట నీట మునిగిందన్నారు. ఈ పొలాల్లో నీటిని కాలువ ద్వారా బయటకు పంపించే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం తెగుళ్ల నివారణకు మందు పిచికారీ చేయించారు.

రహదారి మధ్యలో నేలకొరిగిన చెట్టు



వీపీ అగ్రహారం రహదారిలో కూలిపోయిన చెట్టు

మాకవరపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు పెద్ద చెట్టు నేలకూలింది. మండలంలోని వీపీ అగ్రహారం గ్రామానికి వెళ్లే మార్గంలో మంగళవారం ఉదయం ప్రమాదం జరిగింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే చెట్టు పడేటప్పుడు అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానిక ప్రజలు ఊపిరి తీసుకున్నారు. చివరకు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన ఈ చెట్టును స్థానికులే తొలగించారు. దీంతో వాహనదారులు యథావిధిగా ప్రయాణాలు సాగించారు.

తేనెటీగల పెంపకంతో మహిళలకు ఆర్థిక భరోసా

గొలుగొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల పెంపకంతో మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎంపీడీవో మేరీరోజీ చెప్పారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో తేనెటీగల పెంకంపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసక్తి గల రైతులు, డ్వాక్రా సభ్యులు తేనెటీగల పెంపకం చేపట్టాలని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. దీనిపై రైతులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కరుణానిధి, సిబ్బంది అమ్మాజీ పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'ని సద్వినియోగం చేసుకోండి

మాకవరపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి అప్పారావు సూచించారు. శెట్టిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ మెట్ట ప్రాంతం కావడంతో జీడి, మామిడి సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అలాగే బొప్పాయి, కూరకాయల సాగుపై దృష్టిసారించాలన్నారు. అలాగే సరుగుడు సాగు కన్నా ఇతర పంటలపై శ్రద్ధ వహించడం మేలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు రామునాయుడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ 'గాదె'కు వినతి

నాతవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడుకు వినతిపత్రం అందించారు. మండలంలోని జిల్లేడపూడిలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీని వారు కలిసి సమస్యలు వివరించారు. సంఘ కన్వీనర్ పట్లా సతీశ్ మాట్లాడుతూ ఎన్నికల్లో సమగ్రశిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలుతో పాటు గౌరవ వేతనాలు పెంచేలా చూడాలని ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

మహాసభలను తరలిరండి

కె.కోటపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 23 నుంచి జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను తరలిరావాలని సీపీఐ సీనియర్ నాయకులు వేచలపు కాసుబాబు, గొర్లె దేవుడుబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం పోస్టర్లను విడుదల చేశారు. ఇళ్ల స్థలాలతో పాటు నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.రామారావు, రెడ్డి అప్పలనాయుడు, ఎస్.సూర్యనారాయణ, దమ్ము ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి



ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్క్ ఫోర్స్ బృందం

బుచ్చెయ్యపేట ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న భారీ వర్షాలతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ గణాంకాధికారి ఎ.రామచంద్రరావు సూచించారు. మంగళవారం మండలంలో పి.పి.అగ్రహారం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని , ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. రికార్డులలో నమోదు చేసిన వివరాలు ఆధారంగా గర్భిణులు ,బాలింతలు ,కౌమార దశ బాలికల, ఇళ్లకు వెళ్లి వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారి రికార్డులు తనిఖీ చేశారు. ఇమ్యూనైజేషన్ స్పెషల్ డ్రైవ్‌ను పరిశిలించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక వైద్య సిబ్బందికి టీం సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీవో కె. జగదీష్, హెచ్‌వీ రమణమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో జిల్లా సీఐటీయూ మహాసభలు



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చోడవరం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): చోడవరంలో సెప్టెంబరు 6,7 తేదీలలో సీఐటీయూ జిల్లా 13వ మహాసభలు నిర్వహిస్తున్నట్టు ీసంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా మహాసభల్లో కార్మికులు, ఉ ద్యోగులు, స్కీం వర్కర్ల సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వి.వి. శ్రీనివాసరావు, గూనూరు వరలక్ష్మి, ప్రేమ చంద్రశేఖర్, బొద్దాన రామలక్ష్మి, రైతు సంఘం నాయకులు ఎస్.వి. నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి: ఎస్‌ఐ



మేడివాడలో వ్యాపారులకు నోటీసులు ఇస్తున్న ఎస్‌ఐ రఘువర్మ

రావికమతం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు దుకాణాలు, ఇళ్ల, ప్రార్థనా స్థలాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానిక ఎస్‌ఐ రఘువర్మ అన్నారు. ఈ మేర కు మంగళవారం మేడివాడలో పలువురి వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దుకాణాలు, గృహాలకు సంబంధించి వాటి యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే.. చోరీలు నియంత్రణకు దోహద పడతాయన్నారు. నేరం జరిగిన సందర్భంలో దోషులను గురించే అవకాశం ఉందన్నారు. ఈ దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో మెట్ట ప్రాంతం రైతుల్లో ఆనందం

▸▸ వరినాట్లు, దమ్ము పనుల్లో నిమగ్నం

చీడికాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని మెట్ట ప్రాంతం రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. నీరు చేరడంతో వర్షాధార రైతులు పొలంపనుల్లో నిమగ్నమయ్యారు. కోనాం జలాశయం నుంచి గత నెల 25న సాగునీటిని విడుదల చేయడంతో ఆయకట్టుకింద రైతులు వరినాట్లు వేస్తున్నారు. ఆగస్టు 9వ తేదీ వరకూ వేసవిని తలపించే ఎం డలతో మెట్టుప్రాంతంలోని ఆకు మడులు ఎండిపోయాయి. ఈ నెల 13 రాత్రి నుంచి 16వ తేదీ వరకూ గ్రామాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో మెట్ట ప్రాంతాలైన కోనాం, మంచాల, చీడిపల్లి, ఎన్.కొత్తూరు, నీలంపేట, వెల్లంకి, చుక్కపల్లి, చెట్టుపల్లి గ్రామాలతోపాటు జలాశయం ఆయకట్టు చివరి భూముల్లో వరినాట్లు పనులను ప్రారంభించారు. ఆది, సోమవారాల్లో కురిసిన వర్షాలకు కాలు వకింద పొలాలు నీటిముంపునకు గురికాగా, కోనాం జలాశయం నీటిమట్టం కూడా ఘననీయంగా పెరిగింది. వర్షాలతో మెట్టు, పల్లం క లిసి కనీసం 75శాతానికి వరినాట్లు పూర్తికానున్నట్టు రైతులు ఆ శాభావం వ్యక్తంచేస్తున్నారు.

బుచ్చెయ్యపేట: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మెట్టు,చెరువుల ఆధారిత భూములలో వరి నాట్లు ముమ్మరం చేశారు. మంగళవారం రైతాంగం పొలాలకే పరిమితమ్యారు. గతంలో మోటార్ల ద్వారా నీటిని తోడి నాట్లు వేసిన పొలాల్లో పేరుకున్న కలుపు తొలగిస్తున్నారు. మెట్టు వ్యవసాయానికి ఈ వర్షాలు ఎంతో ఉపయోగపడినట్లు అన్నదాతలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.



చీడికాడ మండలం వరహాపురంలో ఆకుతీస్తున్న మహిళ రైతులు



బుచ్చెయ్యపేటలో ట్రాక్టర్‌తో దమ్ము చేపడుతున్న దృశ్యం

సచివాలయ సిబ్బంది అన్ని ప్రభుత్వ సేవలందించాలి

▸▸ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి మంజులవాణి



సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులతో మాట్లాడుతున్న మంజులవాణి

రావికమతం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రభుత్వ పరంగా అన్ని సేవలూ అందించాలని అనకాపల్లి జిల్లా డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి మంజులవాణి సూచించారు. మంగళవారం రావికమతం వచ్చిన ఆమె మండలంలో పారిశుధ్య సిబ్బంది వేతనాల బకాయిలపై గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో 522 గ్రామ సచివాలయాల్లో ప్రస్తుతం 3,900 మంది సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ఒక్కో సచివాలయంలో 11 పోస్టులున్నాయని, వీరిలో ఆరు నుంచి 8 మంది సిబ్బందితో తమ పరిధిలో అన్ని ప్రభుత్వ సేవలు అందించాలన్నారు.చాలా చోట్ల డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టేంట్ లేరని సాకుతో కొన్నిచోట్ల ప్రభుత్వ సేవలకు అంతరాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఇకపై సచివాలయంలో పనిచేసే ఇతర ఉద్యోగులు వెటర్నరీ, మహిళ పోలీస్, అగ్రికల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంట్, సర్వేయర్‌లు ఇకనుంచి అన్ని ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించాలన్నారు. దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తే ఆ ఉద్యోగిపై వేటు తప్పదని ఆమె హెచ్చరించారు.

జిల్లాలో వర్క్‌ఫ్రం హోమ్ ఉద్యోగానికి 1,09,861 మంది దరఖాస్తు చేశారన్నారు. వీరిలో కేవలం డిగ్రీ కంటే పై చదువులు చదివిన వారి విద్యార్హత సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. పదో తరగతి, ఇంటర్ చదివిన వారి సర్టిఫికెట్లు నమోదుకు ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. ఈనెల 25 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆమె కోరారు.

జాలర్ల పంట పండింది

▸▸ రైవాడ జలాశయంలో వలకు చిక్కుతున్న అధిక సంఖ్యలో చేపలు



వలకు చిక్కిన చేపతో మత్స్యకారుడు సింహాద్రి

దేవరాపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైవాడ జలాశయంలోకి పరీవాహక ప్రాంతం నుంచి వరద నీరు చేరడంతో అధిక సంఖ్యలో జాలర్ల వలలకు మంగళవారం చేపలు చిక్కాయి. జలాశయ పరిధిలో రైవాడ, పాతబొడ్డపాడు, కొత్త బొడ్డపాడు, సోంపురం, జీనబాడు, తామరబ్బ, ముకుందపురం గ్రామాలకు చెందిన సుమారు 100 మందికి పైగా జాలర్లు ఉన్నారు. గత రెండు రోజుల నుంచి వరద నీరు చేరడంతో ఒక్కొక్క జాలరికి 20 నుంచి 50 కిలోల వరకు చిక్కాయి. సు మారు పదేళ్ల తరువాత ఇంత మొత్తంలో చేపలు దొరకడం ఇదే ప్రథమం. ఒక్కొక్క చేప మూడు నుంచి ఐదు కిలోలు వరకు బరువు ఉంది. శీలావతి, రాగంటి, బొచ్చు చేపలు దొరకడంతో వ్యాపారులు కిలో రూ.100 చొప్పున కొనుగోలు చేశారు. వారు మాత్రం మార్కెట్‌లో కిలో రూ.150 నుంచి రూ. 200కు విక్రయిస్తున్నారు. చాలా కాలం తరువాత ఈ విధంగా ప్రతి ఒక్కరికీ చేపలు దొరికినట్టు రైవాడకు చెందిన సింహాద్రి తెలిపారు. తనకు మంగళవారం 30 కిలోలు శీలావతి చేపలు వలకు చిక్కినట్టు చెప్పారు. గతంలో సాధారణంగా రోజుకు రెండు మూడు చేపలు మాత్రమే దొరికేవని తెలిపారు.



రిజర్వాయర్‌లో దొరికిన చేపలు

నేడు నేత్ర వైద్యశిబిరం

చోడవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఈనెల 20వతేదీన బ్యాంకు ఆవరణలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు బ్రాంచి మేనేజర్ కొమ్మారెడ్డి రాంబాబు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ వైద్యశిబిరాన్ని చోడవరం, మాడుగుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డుపై గోతులు పూడ్చండి



మాడుగుల బస్టాండ్ ఆర్టీసీ బస్ షెల్టర్ సమీపంలో మరుగునీరుని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

మాడుగుల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించాలని పంచాయతీ కార్యదర్శికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ప్రమాదాలకు దారితీస్తున్న గుంతలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శిని పిలిపించి మాట్లాడారు. నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని అన్నారు. బస్ షెల్టర్ పక్కనే పెద్ద గోయితో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిని పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆ య న కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వడ్డాది బాబు, బూత్ కన్వీనర్లు కొట్టేడ నానాజీ, మంగరాజు, పల్లేల రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

49 మంది దివ్యాంగ పింఛన్లు రద్దు

రావికమతం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనర్హులైన 49 మందికి దివ్యాంగ లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి పింఛన్లు నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని స్థానిక ఎంపీడీవో సీతారామ స్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, దివ్యాంగ పింఛన్ లబ్ధిదారుల వైకల్యంపై ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులతో విచారించి కొత్తగా సర్టిఫికెట్లు జారీకి ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ మేరకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో 40 శాతం కన్నా తక్కువ వైకల్యం ఉండి దివ్యాంగ పింఛన్ పొందుతున్న మండలంలో 49 మందికి పింఛన్లు ప్రభుత్వం రద్దు చేసినట్టు చెప్పారు. మరో 20 మంది దివ్యాంగులకు వృద్ధాప్య పింఛన్లుగా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్టు ఆయన తెలిపారు. మరో ముగ్గురికి తాత్కాలిక వైకల్యంగా నిర్ధారించారన్నారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే తనకు ఫిర్యాదు చేయాలని కోరారు.


ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పెంపు

కె.కోటపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (దూర విద్యా విధానం) ద్వారా టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సులకు 2025-2026లో అడ్మిషన్లకు వచ్చే నెల 15వ తేదీ వరకు రూ. 200 అపరాధ రుసుంతో గడువు పొడిగించినట్టుఏపీ సార్వత్రిక విద్యాపీఠం, స్థానిక అయ్యన్న ఇంగ్లీషు మీడియం స్కూల్, జూనియర్ కాలేజీ స్టడీ సెంటర్ల కో-ఆర్డినేటర్ డాక్టర్ ఖాశీం తెలిపారు. 14 ఏళ్ల వయస్సు, చదవటం, రాయటం పరిజ్ఞానం కలవారు, పదో తరగతి పరీక్షలు ఫెయిలైన వారు టెన్త్‌లో చేరేందుకు అర్హులని చెప్పారు. అలాగే 15 ఏళ్లు నిండి పదో తరగతి పూర్తయిన వారు, ఇంటర్ ఫెయిల్, చదువుతూ మధ్యలో మానేసిన వారు ఇంటర్‌లో చేరి ఐదు సబ్జెక్టులతో సింగిల్ సిట్టింగ్ విధానం ద్వారా కోర్సు పూర్తి చే యవచ్చని ఆయన తెలిపారు. వివరాలకు స్టడీ సెంటర్ల పని వేళల్లో నేరుగా సంప్రదించవచ్చునని ఖాశీం కోరారు.

ప్రాణం నిలిపే సంజీవని!

బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు వరం టెనెక్టీప్లాజ్ ఇంజక్షన్

- విమ్స్, కేజీహెచ్‌లో రోగులకు ఉచితం
- ఒక్కో ఇంజక్షన్ ఖరీదు రూ.40 వేలు
- బాధితులకు సాంత్వన చేకూరుస్తున్న వైనం
- సకాలంలో రోగులను ఆస్పత్రికి తీసుకురావడమే కీలకం
- ఇంజక్షన్ ఇచ్చిన మూడు గంటల్లో రోగి సాధారణ స్థితికి





విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):

బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు సంజీవనిగా నిలుస్తోంది టెనెక్టీప్లాజ్ ఇంజక్షన్. అత్యంత ఖరీదైన దీనిని కేజీహెచ్, విమ్స్ ఆస్పత్రుల్లో రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ బారినపడిన బాధితులకు ఈ ఇంజక్షన్‌ను మూడు నుంచి నాలుగు గంటల్లోగా ఇస్తే రోగి వేగంగా కోలుకునేలా చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ ఇంజక్షన్‌ను మార్కెట్‌లో కొనుగోలు చేయాలంటే కనీసం రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. విమ్స్‌లో నెలకు సగటున పది మందికి, కేజీహెచ్‌లో 20 మందికి ఉచితంగా ఇంజక్షన్లు అందించి వారి ప్రాణాలు నిలబెడుతున్నారు.



బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన బాధితులకు వెంటనే ఈ ఇంజక్షన్ ఇవ్వడం వల్ల మెరుగైన ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అయితే చాలా మందిలో అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే ఈ రెండు ఆస్పత్రులకు తీసుకువస్తే ఉచితంగా ఇంజక్షన్ పొందవచ్చని సూచిస్తున్నారు.

ఇవీ లక్షణాలు..

బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల్లో చేతులు తిమ్మిర్లు ఎక్కడం, మూతి వంకర పోవడం, కాళ్లు, చేతులు తీవ్రమైన నీరసంగా ఉండడం, కొన్నిసార్లు ఫిట్స్ వచ్చినట్టు కొట్టుకోవడం, కళ్లు తిరిగి కింద పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఈ స్థితిలో వెంటనే ఆస్పత్రిలో చేర్చాలి. లక్షణాలను బట్టి సీటీ స్కాన్ చేసి నిర్ధారించి ఇంజక్షన్ అందిస్తారు.

గోల్డెన్ అవర్‌లో చేర్చాలి..

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన బాధితుడిని మూడు నుంచి నాలుగున్నర గంటల్లో ఆస్పత్రిలో చేర్చాలి. దీనిని గోల్డెన్ అవర్ అంటారు. ఈ సమయంలో చేర్చిన రోగులకు మాత్రమే ఇంజక్షన్ ఇవ్వడానికి అవకాశం ఉంది. సీటీ స్కాన్ పరీక్ష చేసి ఇంజక్షన్ ఇవ్వవచ్చా? లేదా.? అన్నది వైద్యులు నిర్ధారిస్తారు. బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల్లో చాలా మందికి రక్తం గడ్డకడుతుంది. ఇలాంటి వారికి మాత్రమే ఈ ఇంజక్షన్ ఇచ్చే అవకాశం ఉంది. కొందరికి బ్రెయిన్‌లో రక్తం బ్లీడ్ అవుతుంది. వారికి ఇంజక్షన్ ఇవ్వడం వల్ల ఫలితం ఉండదు. గడ్డ కట్టిన రక్తాన్ని కరిగించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇంజక్షన్ ఇచ్చిన మూడు గంటల్లోనే రోగి సాధారణ స్థితికి చేరుకుంటాడని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చినట్టు గుర్తిస్తే వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లి ఈ ఇంజక్షన్ చేయించుకోవాలని సూచిస్తున్నారు.

పెరుగుతున్న బాధితులు..

గతంతో పోలిస్తే బ్రెయిన్ స్ట్రోక్ బారినపడుతున్న వారి సంఖ్య పెరిగింది. ప్రతిరోజూ కేజీహెచ్‌కు కనీసం మూడు నుంచి ఐదు బ్రెయిన్ స్ట్రోక్ కేసులు వస్తుంటాయి. వీరిలో సమయానికి రాలేకపోయిన వారే ఎక్కువ. వారికి ఈ ఇంజక్షన్ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతోంది. కొందరికి బ్లీడింగ్ కావడంతో ఇవ్వలేకపోతున్నామని వైద్యులు చెబుతున్నారు. సకాలంలో తీసుకువచ్చిన వారికి క్యాజువాల్టీలోనే ఇంజక్షన్ ఇచ్చే ఏర్పాట్లు చేశామని న్యూరాలజీ విభాగాధిపతి గోపి పేర్కొన్నారు. కేజీహెచ్‌లో ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేశామని, ఈ ఇంజక్షన్ ఇచ్చిన తరువాత ఫాలో అప్ ట్రీట్‌మెంట్ కూడా అందిస్తున్నామన్నారు. విమ్స్‌లో గత ఏడాది నుంచి ఇంజక్షన్ అందిస్తున్నామని డైరెక్టర్ రాంబాబు వెల్లడించారు. ప్రాణాపాయ స్థితిలో, కనీసం సరిగా చూడలేని పరిస్థితుల్లో వచ్చిన ఎంతో మంది రోగులు మూడు, నాలుగు గంటల్లో సాధారణ స్థితికి చేరుకుంటున్నారన్నారు. స్ట్రోక్ వచ్చిన వెంటనే ఆస్పత్రికి తీసుకురావడం కీలకమని గుర్తించాలని చెబుతున్నారు.

క్రైం... crime news

చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తెలిపారు. ఈనెల 16వ తేదీ రాత్రి పూల్‌బాగ్ రోడ్డులోకి వెళ్లే సమయంలో లారీ ఢీకొనడంతో ఆటోడ్రైవర్ నమ్మి రమణ, విజయరామరాజుపేటకు చెందిన సుందరపల్లి లోకేశ్ గాయపడ్డారు. ఇద్దరికి ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ నమ్మి రమణ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ శేఖరం తెలిపారు.

అశ్లీల నృత్యాల నిర్వాహకులపై కేసు : సీఐ



అశ్లీల నృత్యాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ ధనుంజయరావు

ఎలమంచిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏటికొప్పాకంలో శ్రీకృష్ణాష్టమి కార్యక్రమంలో అశ్లీల నృత్యాలు నిర్వహించిన నిర్వాహకులపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు సీఐ ధనుంజయరావు తెలిపారు. అశ్లీల నిర్వాహకులను స్టేషన్‌కు పిలిపించుకొని ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కార్యక్రమానికి బాధ్యులైన ఏడుగురు కమిటీ ప్రతినిధులపై కేసు నమోదు చేశామన్నారు. ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజీ ప్రోగ్రామ్‌లు అయినా మైక్ నిర్వహణ అనుమతి కోసం పోలీసులను సంప్రదించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని సీఐ ధనుంజయరావు తెలిపారు.

కారిడార్ పనులపై ఆర్డీవో ఆరా



కారిడార్ భూములపై ఆరా తీస్తున్న ఆర్డీవో రమణ

నక్కపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో జరుగుతున్న బల్క్‌డ్రగ్ పనులపై మంగళవారం నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ ఆరా తీశారు. నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయంలో పలు పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అదనపు భూ సేకరణకు సంబంధించి భూములు సేకరించాల్సిన గ్రామాల్లో సర్వే నంబర్లను డీటీ నారాయణరావు వివరించారు. నిర్వాసిత రైతుల సమస్యలు, ప్యాకేజీ తదితర అంశాల గురించి చర్చించారు.

దమ్ములో డీఏపీ వాడాలి

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



వరినాట్లు వేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, ఏవో ఉమాప్రసాద్

నక్కపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వరిసాగు చేసే రైతులు దమ్ము సమయంలో డీఏపీ వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బీ మోహన్‌రావు సూచించారు. మండలంలోని వేంపాడు, చినరాంభద్రపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా క్షేత్ర పర్యటన చేశారు. వరి పొలాలను పరిశీలించారు. రైతులతో కలిసి జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, ఏవో ఉమాప్రసాద్ వరినాట్లు వేశారు. వరి పంట కాలంలో 32 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20కిలోల పొటాషియం ఎరువులను వేసుకోవాలని సూచించారు.

ఆర్ఈసీఎస్‌పై విచారణకు మోకాలడ్డు?

... 5వ పేజీ తరువాయి

పెట్టకుండా, ప్రభుత్వ అనుమతి లేకుండా కోట్ల రూపాయల విద్యుత్ పరికరాలు కొనుగోలు చేశారు. అడ్డగోలుగా పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వాటిపై ఫిర్యాదులు అందడంతో ఈఆర్‌సీ చైర్మన్ తక్షణమే తమ ముందు హాజరై వివరాలు సమర్పించాలని ఎండీని ఆదేశించడంతో ఉద్యోగం పోతుందనే భయంతో చేసింది తప్పేనని ఒప్పుకొని ఆర్ఈసీఎస్‌ను 2021 సెప్టెంబరులో ఈపీడీసీఎల్‌కు అప్పగించారు. ఆ తరువాత వాటన్నింటిపై విచారణ చేయాలని సహకార శాఖకు చెందిన అధికారిణి శ్యామలను ఉన్నతాధికారులు ఆదేశిస్తే, ఎటువంటి తప్పులు జరగలేదని ఆమె నివేదిక ఇచ్చారు. ఇప్పుడు 51 విచారణ జరుగుతోంది. మరోవైపు ఈపీడీసీఎల్ అధికారులు సిబ్బంది సర్వీసు రిజిస్టర్లన్నీ తిరగేస్తున్నారు. అనర్హుల ఏరివేతకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఇవి ముందుకు సాగకుండా ఉండేందుకు ఉద్యోగులు కొందరు వినియోగదారుల పేరిట హైకోర్టును ఆశ్రయించి స్టే తేవాలని ప్రయత్నించారు. అటువంటి చర్యలు తగవని, వారిపై చర్యలకు ఆదేశించాల్సిన విజయవాడ అధికారి ఏమీ తెలియనట్టు, సమాచారం లేదని మిన్నకుండిపోయారు. ఇక్కడ అనకాపల్లి జిల్లా అధికారులు కూడా చర్యలకు తాత్సారం చేస్తున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

- కలెక్టర్ విజయకృష్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణాలు లక్ష్యంలో జిల్లాలో ఇంకా 4,328 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉందని, వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో గృహ నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు ఆర్థిక సహాయం ఉపయోగించి ఇళ్లను పూర్తి చేయించాలన్నారు. అదనపు ఆర్థిక సహాయం పొంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేయని వారి నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఏమినిటీ సెక్రటరీలతో రోజువారి సమీక్షలు నిర్వహించి, పురోగతిని సాధించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ వై. శ్రీనివాసరావు, డీఈఈలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలి

- సిబ్బందికి ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం
- రాంబిల్లి పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్, కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ



రాంబిల్లిలో రిసెప్షన్, కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

రాంబిల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రిసెప్షన్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్మించిన రిసెప్షన్, కౌన్సెలింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే నేరాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని, ఎటువంటి అలసత్వం ఉండకూడదని హెచ్చరించారు. పారిశ్రామిక ప్రమాదాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్లు ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తీవ్రమైన కేసుల సీడీఫైల్స్‌ను పరిశీలించి ఆయా కేసుల పురోగతిని తెలుసుకొని, సూచనలు చేశారు. సీజ్ చేసిన వాహనాలకు ట్యాగ్‌లు వేయాలన్నారు. పూర్తికాని కేసులలో విచారణ వేగవంతం చేయాలన్నారు. రౌడీషీటర్స్, చెడు నడత కలిగిన వ్యక్తుల వివరాలను తెలుసుకొని, ప్రస్తుతం వారు జీవనోపాధికి ఏ పనులు చేస్తున్నారో ఆరా తీశారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ సిబ్బంది సమస్యలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సర్కిల్ సీఐ సీహెచ్‌నర్సింగరావు, ఎస్ఐ డి.నాగేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుట్టుగా మత్తు మాత్రల తయారీ

రూ.23.88 కోట్ల విలువైన 119.4 కేజీల రసాయన మిశ్రమం స్వాధీనం

అచ్యుతాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-రాంబిల్లి మండలాల పరిధిలోని ఫార్మా కర్మాగారాల్లో గుట్టుచప్పుడు కాకుండా అల్ప్రాజోలం (మత్తు మాత్రలు) తయారీని కేంద్ర ప్రభుత్వానికి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్సీ (డీఆర్ఐ) అధికారులు పట్టుకున్నారు. రాంబిల్లి మండలం లాలంకోడూరు పరిధిలోని ఎవరెక్స్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారంలో మత్తు మాత్రలు తయారవుతున్నట్టు డీఆర్ఐ అధికారులకు సమాచారం అందింది. దీంతో వీరు ఆదివారం అర్థరాత్రి వరకు కర్మాగారంలో సోదాలు జరిపారు. ఈ మాత్రలు తయారీకి ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులను ఇక్కడకు తీసుకువచ్చారని తెలిసింది. ఇక్కడ తయారైన మత్తు మాత్రలు కల్లు తయారీతో పాటు వివిధ రకాల పదార్థాల్లో కలిపి విక్రయిస్తున్నట్టు సమాచారం. ఈ సోదాల్లో రూ.23.88 కోట్ల విలువైన 119.4 కేజీల రసాయన మిశ్రమంతోపాటు 87.8 కేజీల ముడి సరుకు, 3600 లీటర్ల ముడిద్రవం స్వాధీనం చేసుకున్నారని తెలిసింది. వీటి తయారీని చేస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరు గతంలో నేరచరిత్ర కలిగిన వారుగా అధికారులు గుర్తించినట్టు తెలిసింది.

736 కిలోల గంజాయి స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

గంజాయి లభ్యమైంది. నిందితులు ఒడిశా రాష్ట్రం చిత్రకొండలో గంజాయిని కొనుగోలు చేసి తమిళనాడుకు రవాణా చేయడానికి ప్రయత్నిస్తూ పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో తమిళనాడు రాష్ట్రం తిరువళ్ళూరుకి చెందిన తరుణ్‌కుమార్, చింతపల్లి మండలం దోమలగొంది గ్రామానికి చెందిన గడుగు కొండబాబు, చిత్తూరు జిల్లా సత్యవేడుకి చెందిన డ్రైవర్ ఎ.దినేశ్ ఉన్నారు.

పాయకరావుపేటలో 200 కిలోలు..



నర్సీపట్నంలో స్వాధీనం చేసుకున్న గంజాయి. నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ పోలీసులు

పాయకరావుపేట మండలంలోని సీతారాంపురం జంక్షన్ వద్ద పోలీసులు సోమవారం 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. మంగళవారం పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో నర్సీపట్నం డీఎస్పీ కె.శ్రీనివాస్ ఈ వివరాలు వెల్లడించారు. గొలుగొండ మండలం రావణాపల్లి సమీపంలో ఏటిగైరమ్మపేట గ్రామానికి చెందిన గంజాయి స్మగ్లర్ గొర్లి గంగునాయుడు ఇటీవల ఒడిశా నుంచి ఏజెన్సీలోని లంబసింగికి తెచ్చిన 200 కిలోల గంజాయిని ఆటోలో గబ్బాడ మీదుగా నర్సీపట్నం తీసుకువచ్చి అక్కడి నుంచి కారులో నక్కపల్లి మండలం నెల్లిపూడి గ్రామంలో ఒక తోటలో డంప్ చేశాడు. దీనిని సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామానికి చెందిన బైపురెడ్డి రత్నం కారులో రాజమహేంద్రవరానికి తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో పాయకరావుపేట సీఐ జి.అప్పన్న, ఎస్ఐ పురుషోత్తం తమ సిబ్బందితో మండలంలోని సీతారాంపురం జంక్షన్ వద్ద పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని బైపురెడ్డి రత్నంతోపాటు తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటకు చెందిన ఎర్రమిల్లి నాగవీరశివ, కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామానికి చెందిన కోళ్ల నాగసతీశ్‌లను అరెస్టు చేశారు.



పాయకరావుపేట పోలీసులు పట్టుకున్న గంజాయి, కారు, నిందితులు

రైవాడ నీరు విడుదల

- 500 క్యూసెక్కులు నీటిని విడుదల చేసిన జలాశయం అధికారులు
- రైవాడ జలాశయానికి భారీగా పెరిగిన ఇన్‌ఫ్లో



రైవాడ ఏడో గేటు నుంచి నీరు విడుదల చేసిన దృశ్యం

దేవరాపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయంలోకి రెండు వేల క్యూసెక్కుల వరద నీరు చేరడంతో మంగళవారం రాత్రి ఒక గేటు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. పినకోట, సమ్మెద గెడ్డల నుంచి మంగళవారం భారీగా వరద నీరు చేరడంతో జలాశయ గరిష్ఠ నీటమట్టం 114 మీటర్లు కాగా 113.35 మీటర్లకు చేరింది. దీంతో 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు జలాశయ డీఈఈ సత్యంనాయుడు తెలిపారు. జలాశయంలో నీటిమట్టం 113.50 మీటర్లకు దాటకుండా అదనంగా వరద నీటిని బయటకు పంపుతామన్నారు. జలాశయ కింద ఉన్న గ్రామాల ప్రజలు శారదా నదిలో రాకపోకలు జరపకూడదని ఆయన కోరారు. కాగా తహశీల్దార్ లక్ష్మీదేవి వీఆర్వోల ద్వారా గ్రామాల్లో ప్రజలకు తెలియజేశారు.

పంచాయతీరాజ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ అధికారులతో కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం సమీక్షించారు. పంచాయతీరాజ్ శాఖ పనులకు సంబంధించి నియోజకవర్గాల వారీగా నాబార్డు, పాట్ హోల్స్, ఇతర గ్రాంట్లను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనుల గురించి ఆరా తీశారు. ఈ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్లు ఆర్ఎస్ ప్రసాద్, జీఎస్ఎస్ ప్రసాద్, జి.శారదాకుమారి, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఖరీఫ్‌నకు ఊపిరి

... 5వ పేజీ తరువాయి

సిద్ధం చేసుకున్న రైతులు నాట్లు వేసేందుకు వర్షాల కోసం ఎదురు చూశారు. రెండు రోజుల కిందట జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో అన్నదాతలు వ్యవసాయ పనులు మరింత ముమ్మరం చేస్తున్నారు. వెదజల్లే పద్ధతిలో వరి నాట్లు వేసిన రైతులు పొలాల్లో చేరిన వర్షపు నీటిని బయటకు పంపే పనుల్లో నిమగ్నమయ్యారు. కొన్ని చోట్ల దుక్కి, దమ్ము పనులు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 55 వేల హెక్టార్లలో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నట్టు వ్యవసాయాధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

రైతులకు అందుబాటులో కాంప్లెక్స్ ఎరువులు

జిల్లాలో రెండు వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. జిల్లాలో మంగళవారం నాటికి 10 వేల హెక్టార్లలో వరి నాట్లు పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం పొలాల్లో పుష్కలంగా నీరు చేరడంతో ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా మూడు వేల హెక్టార్లలో వరి నాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ నెలాఖరు నాటికి 40 వేల హెక్టార్లలో వరి నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. రైతులు దమ్ములో యూరియా వేసేందుకు మొగ్గు చూపడం సరికాదని, దమ్ములో కాంప్లెక్స్ ఎరువులు వేయాలని సూచించారు. డీఏపీలో కూడా నత్రజని ఉన్నందున దమ్ములో ఏడీపీ వేయాలన్నారు. జిల్లాలో రైతు సేవా కేంద్రాల్లో కాంప్లెక్స్ ఎరువులు రెండు వేల టన్నుల వరకు అందుబాటులో ఉన్నాయన్నారు. డీఏపీ బస్తా రూ.1,350కి అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

గొలుగొండ మండలంలో..

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలో మంగళవారం రైతులు దుమ్ములు, వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, ఏఎల్‌పురం, సీహెచ్ నాగాపురం, తదితర గ్రామాల్లో రైతులు వరినాట్లతో పాటు ట్రాక్టర్‌తో దమ్ములు చేయిస్తున్నారు. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఖరీఫ్, రబీ వరినాట్లకు ఇబ్బందులు తొలగినట్టేనని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524